మానవ హక్కులు ఎక్కడ..?



బతుకుతానని అనుకోలేదు..!

అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రిలో దాసరి కిరణ్ చికిత్స పొందుతున్నాడు. ఆ రోజు ఏం జరిగింది అని అడిగితే.. కన్నీటిపర్యంతమవుతూ.. నేను బతుకుతానని అనుకోలేదు.. విలేకరులు వచ్చి పలకరించే దాకా..' అని అన్నాడు.

దాసరి కిరణ్‌పై దాడి పట్టదా..?

ఇప్పటికీ నమోదు కాని కేసు

ఆస్పత్రిలో ఉన్నా పట్టని పోలీసులు

గొడవలు జరిగితే ఎక్కడైనా ప్రత్యర్థులు దాడి చేస్తారు. కొందరు చంపేయాలని చూస్తారు. కానీ తాడిపత్రిలో అందుకు భిన్నంగా జరిగింది. శాంతిభద్రతలను కాపాడే పేరిట అక్కడికి వెళ్లిన పోలీసులు.. ఏవో వ్యక్తిగత కక్షలు తీర్చుకునేందుకు ప్రయత్నించినట్లు కనిపిస్తోంది. మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి క్యాంప్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ దాసరి కిరణ్‌ను చితకబాదాలని పోలీసులను డీఎస్పీ చైతన్య పురమాయించడం విస్తుగొలుపుతోంది. ఆ తరువాత అతని పట్ల వ్యవహరించిన తీరు అమానవీయంగా కనిపిస్తోంది. నిలువెల్లా రక్తంతో తడిసిపోయిన అతడిని చూసి.. ఎవరైనా నరికేశారేమో అనే భ్రమ కలుగుతుంది. పోలీసులు ఆ స్థాయిలో కొట్టారు. ఇంత జరిగినా ఏ ఒక్క పోలీసు అధికారీ అతని స్టేట్‌మెంట్ రికార్డు చేయలేదు. 'మెడికో లీగల్ కేసు' కూడా నమోదు చేయలేదని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు ఆవేదన వ్యక్తం చేయడం.. పోలీసుల వ్యవహారా శైలిని తెలియజేస్తోంది. యథేచ్ఛగా మానవహక్కుల ఉల్లంఘన జరిగినా.. సంబంధీకులు ఎవరూ స్పందిచకపోవడం విమర్శలకు తావిస్తోంది.

అసలేం జరిగింది..?

కిరణ్: అర్థరాత్రి ఒకట్నిర గంటల సమయంలో పోలీసులు పెద్ద సంఖ్యలో జేసీ ప్రభాకర్‌రెడ్డి ఇంటి సమీపంలో తచ్చాడుతున్నారు. నేను ఇంకా పడుకోలేదు. ఇంటి ఆవరణంలో తిరుగుతున్నాను. ఓ పోలీసు ఇంటి గేటు తీశారు. దాసరి కిరణ్ నువ్వేనా అని హిందీలో అడిగారు. అవును అని చెప్పగానే డీఎస్పీ చైతన్య పిలుస్తున్నారని చెప్పారు. ఇంటి లోపలికి (జేసీపీఆర్ కుటుంబం ఉండే ప్రాంతం) వెళ్లగానే అక్కడ డీఎస్పీ చైతన్య, పోలీసులు ఉన్నారు. నన్ను చూడగానే బూతులు తిట్టారు. వీడిని లోపలికి వేయండి అని ఆదేశించారు. నన్ను కొట్టుకుంటూ బయట ఉన్న బస్సు లోపలికి తీసుకెళ్లారు. బస్సు లోపల లాఠీలతో చితకబాదారు. కాళ్లపై లాఠీ దెబ్బ పడటంతో కింద పడ్డాను. ఆ సమయంలోనే తలపై లాఠీలతో కొట్టారు. రక్తం కారుతున్నా వదిలిపెట్టలేదు. ఆ తరువాత రూరల్ సీఐ లక్ష్మికాంతరెడ్డి వచ్చారు. సర్.. రక్తం ఎక్కువ కారుతోంది.. టార్చ్‌లైట్ వేయండి అని అడిగాను. రక్తమొస్తే ఏమవుతుందిలే.. అరుగుతుందా తరుగుతుందా అని నిర్లక్ష్యంగా అన్నారు.

ఆస్పత్రికి ఎలా వచ్చారు..?

కిరణ్: కొట్టడం అయ్యాక బస్సులోనే సజ్జలదిన్నె వద్దకు తీసుకెళ్లారు. అక్కడ బస్సు దిగే సమయంలో టౌన్ సీఐ మురళీకృష్ణ నా పరిస్థితి చూశారు. ఏమైంది అంటూ తన కర్చీఫ్ నా తలపై వేశారు. అక్కడున్న పోలీస్ సిబ్బందిని పిలిచి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లాలని సూచించారు. ఆస్పత్రికి వచ్చేసరికే నాకు మగత ఎక్కువైంది. ఏమైంది అని నర్సులు అడుగుతుంటే.. నరికి పడేస్తే చూసి తీసుకొచ్చాం అని ఎవరో చెప్పారు. అంతవరకే గుర్తుంది. రక్తగాయాలతో ఉన్న ఫొటో ఎవరు తీశారో గుర్తు లేదు. అది చూసి చాలామంది నేను చనిపోయానని అనుకున్నారు. మరుసటి రోజు ఉదయం 5.30 గంటలకు అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చారనుకుంటా. నాకు 6.30 గంటలకు మెలకువ వచ్చింది. ఆ తరువాత విలేకరులు వచ్చి పలకరించారు. అప్పటి వరకు నేను చచ్చాననే అందరూ అనుకున్నారు. - **అనంతపురం క్రైం**



ఆస్పత్రిలో కిరణ్ కంటతడి

వాన మొదలైంది..!

ఉష్ణోగ్రతలు

గరిష్ఠం 35.0 కనిష్ఠం 26.0



విడపనకల్లు: చెరువును తలపిస్తున్న పొలాలు



ఉధృతంగా పారుతున్న కొట్టాలపల్లి వంక





ఉరవకొండలో కురుస్తున్న వర్షం

అనంతపరం అర్బన్/విడపనకల్లు/ఉరవకొండ, మే 17: ఖరీఫ్ ఆరంభానికి ముందు జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. పలు ప్రాంతాల్లో జల్లులు, మోస్తరు వర్షాలు నమోదు అవుతున్నాయి. ఎనిమిది మండలాల్లో గురువారం రాత్రి వర్షం కురిసింది. డి.హిరేహాల్‌లో అత్యధికంగా 28.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. బొమ్మనహాళ్‌లో 28.0, విడపనకల్లులో 24.08, వజ్రకరూరులో 19.2, ఉరవకొండలో 16.2, కూడేరులో 8.2, గుంతకల్లులో 3.2, పామిడిలో 1.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఉరవకొండలో శుక్రవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. అనంతపురం, తాడిపత్రి, గుంతకల్లు తదితర మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి.

- విడపనకల్లు మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. అర్ధరాత్రి 12.30 గంటలకు మొదలై.. తెల్లవారు జామున 3 గంటల వరకూ కొనసాగింది. వర్షపు నీటికి పొలం గట్లు తెగిపోయాయి. కుంటలు, బావులకు నీరు చేరింది. లోతట్టు ప్రాంతాల్లోని పొలాలు కుంటలను తలపిస్తున్నాయి.
- ఉరవకొండలో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సుమారు గంటన్నర పాటు ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. పాత బస్టాండ్‌లోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. టవర్ క్లాక్ కూడలిలో వర్షపు నీరు నిలబడటంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఎండ వేడిమితో అల్లాడుతున్న ప్రజలకు రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో ఉపశమనం కలిగింది.

స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద పటిష్ట భద్రత ఉండాలి

రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జేసీ తదితరులు

అనంతపురం టౌన్, మే 17: ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్స్ వద్ద పటిష్ట భద్రత కొనసాగించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లా ఎన్నికల అధికారిని ఆదేశించారు. విజయవాడ నుంచి శుక్రవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వినోద్ కుమార్, జేసీ కేతన్‌గార్గ్, నగరపాలిక కమిషనర్ మేఘస్వరూప్, డీఆర్వో రామకృష్ణారెడ్డి, ఆర్వోలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖేష్‌కుమార్ మీనా మాట్లాడుతూ, స్ట్రాంగ్ రూమ్స్ వద్ద నిబంధనల మేరకు భద్రత కొనసాగించాలని సూచించారు. 144 సెక్షన్‌ను పటిష్టంగా అమలుచేయాలని అన్నారు. ఏ నిర్ణయం తీసుకున్నా.. పార్టీలకు, అభ్యర్థులకు తెలియజేయాలని సూచించారు. కౌంటింగ్ ముగిసే వరకు ఎక్కడా నిర్లక్ష్యం చేయరాదని అన్నారు. కౌంటింగ్‌కు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. శాంతి భద్రతల విషయంలో ఎక్కడా రాజీపడవద్దని అన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అల్లర్లు జరగకుండా చూడాలి

టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్



మాట్లాడుతున్న వెంకటశివుడు యాదవ్

అనంతపురం అర్బన్, మే 17: కౌంటింగ్ నేపథ్యంలో జిల్లాలో అల్లర్లు జరగకుండా పోలీసు యంత్రాంగం పటిష్ట చర్యలు తీసుకోవాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ డిమాండ్ చేశారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్ మొద్దీన్‌తో కలిసి శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తాడిపత్రిలో పోలింగ్ రోజు ఎమ్మెల్యే పెద్దారెడ్డి, ఆయన కుమారుడు టీడీపీ ఏజెంట్లను బెదిరించారని, వాహనాలను ధ్వంసం చేశారని, నాయకులపై రాళ్ల దాడి చేశారని అన్నారు. మరుసటి రోజు టీడీపీ నాయకుడు సూర్యముని ఇంటిపై రాళ్ల దాడి చేశారని, జేసీ ప్రభాకర్‌రెడ్డి ఇంటిపై దాడికి యత్నించారని అన్నారు. పోలీసులు వారిని నిలువరించడంలో విఫలమయ్యారని అన్నారు. జేసీ ప్రభాకర్‌రెడ్డి ఇంటో పనివాళ్లను డీఎస్పీ చైతన్య బెదిరించారని, కంప్యూటర్ ఆపరేటర్ దాసరి కిరణ్‌ను విచక్షణా రహితంగా కొట్టారని మండిపడ్డారు. బాధితుడు చికిత్స పొందుతున్నాడని, ఇప్పటికీ పోలీసులు వాగ్మూలం తీసుకోలేదని అన్నారు. డీఎస్పీ చైతన్యపై హత్యాయత్నం కేసు నమోదు చేసి, అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు మేల్కోవాలని, కౌంటింగ్‌ను దృష్టిలో ఉంచుకొని భద్రత పెంచాలని కోరారు. ఈ ఎన్నికల్లో టీడీపీ విజయం ఖాయమని, సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయడం తథ్యమని అన్నారు.

24 నుంచి విత్తన పంపిణీ

కలెక్టర్ వినోద్ కుమార్



విత్తనం, బ్యాంకు రుణాల సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్ కుమార్

అనంతపురం టౌన్, మే 17: అడిగిన ప్రతి రైతుకు ఈ నెల 24 నుంచి విత్తనం అందించాలని కలెక్టర్ వినోద్ కుమార్.. అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో వ్యవసాయ, మార్కెటింగ్, బ్యాంకింగ్ అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో సాగయ్యే పంటలు, విత్తన సేకరణ చర్యలు, పంపిణీ గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 18 నుంచి రైతు భరోసా కేంద్రాలలో రైతుల పేర్లు రిజిస్ట్రేషన్ చేయాలని సూచించారు. విత్తనం విషయంలో రైతులు ఇబ్బందులు పడకుండా చూడాలని ఆదేశించారు. వేరుశనగతోపాటు ప్రత్యామ్నాయ పంటల విత్తనాలు కూడా అందుబాటులో ఉంచాలని సూచించారు. విత్తన నాణ్యతలో ఎక్కడా రాజీ పడకూదని అన్నారు. వ్యవసాయ, మార్కెఫెడ్ అధికారులు సమయ్వయంతో పనిచేయాలని సూచించారు. చిన్న, సన్నకారు, కౌలు రైతులకు పంపిణీలో ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. విత్తనం పక్కదారి పట్టకుండా పర్యవేక్షించాలని వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. విత్తనం అమ్మిన తర్వాత వచ్చిన డబ్బును ఏరోజుకారోజు బ్యాంకులలో జమచేయాలని, ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని అన్నారు. కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి పర్యవేక్షించాలని ఏపీ సీడ్స్ జిల్లా అధికారులను ఆదేశించారు. బ్యాంకర్లు పంట రుణాల విషయంలో రైతులను ఇబ్బంది పెట్టవద్దని సూచించారు. కొత్త రుణాలు ఇవ్వాలని, పాత రుణాల రెన్యువల్స్ చేసి అన్న దాతలను ఆదుకోవాలని సూచించారు. సమావేశంలో జేసీ కేతన్‌గార్గ్, జేడీఏ ఉమా మహేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇంద.. చందా..!

మా పోస్టు మాకే ఇవ్వాలి..

వైసీపీ నేతలకు ఫీల్డ్ అసిస్టెంట్ల విరాళం.. ఉపాధి పనుల్లో కాజేసి.. ఎన్నికల్లో ఖర్చు



దయ్యాలకుంటపల్లి వద్ద ఫారంపాండ్ పనులు చేస్తున్న కూలీలు

బుక్కరాయసముద్రం, మే 17: 'నువ్వు మళ్లీ ఫీల్డ్ అసిస్టెంట్‌గా కొనసాగాలంటే మీ ఊర్లో ఎన్నికల ఖర్చు పెట్టుకో.. లేదంటే వేరే వాళ్లకు అవకాశం ఇస్తాం.' ఇదీ.. పోలింగ్‌కు ముందు ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు వైసీపీ నాయకులు పెట్టిన షరతు. వారు ఇవ్వలేకపోతే మళ్లీ ఆ పోస్టు దక్కదని భయపడ్డారు. డబ్బులు సమకూర్చేందుకు శింగనమల నియోజకవర్గంలో అనేక గ్రామ పంచాయతీల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు అక్రమాలుకు పాల్పడినట్లు సమాచారం. తప్పుడు మస్టర్లతో లక్షలాది రుపాయల స్వాహా చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. పోలింగ్‌కు ముందు వైసీపీ నేతల డిన్నర్లు, ఇతర ఖర్చులకు నగదు సమకూర్చారు. బుక్కరాయసముద్రం మండలంలో పలువురు ఫీల్డ్ అసిస్టెంట్లు రెండు నెలల్లో విచ్చవిడిగా అక్రమాలకు పాల్పడ్డారు. దయ్యాలకుంటపల్లి, పసులూరు గ్రామాల్లో రోజూ పనికి 45 నుంచి 50 మంది వస్తే.. ఏకంగా 200 మంది వచ్చినట్లు మస్టర్లు వేస్తున్నారు. ఎన్నికల సమయంలో ఉన్నతాధికారులు ఇతర పనుల్లో ఉండడం ఫీల్డ్ అసిస్టెంట్లకు కలిసి వచ్చింది. అక్కడ కొల్లగొట్టిన డబ్బులు ఎన్నికల్లో వైసీపీ తరఫున ఖర్చుకు ఇచ్చినట్లు తెలిసింది.

మాకే ఇవ్వాలి..

వైసీపీ తిరిగి అధికారంలోకి వస్తే ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులు తిరిగి తమే ఇవ్వాలని ఆ పార్టీ నాయకులతో కొందరు మాట తీసుకున్నట్లు తెలిసింది. ప్రతి పంచాయతీలో స్థానిక నాయకులకు వారు ఎన్నికల ఖర్చులకు చందా ఇచ్చినట్లు తెలిసింది. కొన్ని గ్రామాల్లో డిన్నర్లు, ఎన్నికల ముందు ఖర్చుల వీరే భరించినట్లు సమాచారం. వైసీపీ నేతలకు ఎన్నికల ప్రచారం సమయంలో ఆర్థిక ఇబ్బందిలు లేకుండా ఫీల్డ్ అసిస్టెంట్లు సర్దుబాటు చేసినట్లు తెలుస్తోంది. కొంత మంది ఫీల్డ్ అసిస్టెంట్లు నిబంధనలు ఉల్లంఘించి ఏకంగా వైసీపీ తరఫున బహిరంగంగా ప్రచారం చేశారు. దీంతో వారిపై వేటు పడింది. మరి కొందరు పరోక్షంగా పార్టీ కోసం పనిచేశారు.

దోచేస్తున్నారు..

జాబ్ కార్డు ఉంటే చాలు.. పనికి రాకపోయినా మస్టర్‌లో పేరు నమోదు చేసుకుని ఉపాధి సొమ్మును స్వాహా చేస్తున్నారు. దయ్యాలకుంటపల్లిలో వైసీపీ ప్రజా ప్రతినిధి సోదరుడు ఫీల్డ్ అసిస్టెంట్‌గా ఉన్నాడు. ఆ గ్రామంలోని గువ్వలకొండపై ఫారం పాండ్ పని చేపట్టారు. ఓ మేట్ పరిధిలో 78 మంది కూలీలు పనిచేసినట్లు మస్టర్‌లో చూపించారు. వాస్తవంగా 23 మంది కూలీలే పనిచేశారు. మిగిలిన 55 మంది పేర్లు అనధికారికంగా చేర్చారు. వారి పేరిట వచ్చే డబ్బులో ఒక్కొక్క కూలీకి రూ.400 ఇచ్చి.. మిగిలినది స్వాహా చేసినట్లు తెలిసింది. పసులూరు గ్రామంలో 70 మంది కూలీలు పనికి పోతే... 200 మంది పనిచేసినట్లు మస్టర్‌లో చేర్చారని ఆ గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. నియోజకవర్గం వ్యాప్తంగా పనిచేయని కూలీల పేర్లు చేర్చి గత మూడు నెలల్లో లక్షలాది రూపాయల స్వాహా చేసినట్లు సమాచారం. ఇందులో వచ్చిన నగదులో రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరుకు ఎన్నికల ఖర్చులకు ఇచ్చినట్లు సమాచారం.

చర్యలు తీసుకుంటాం..

ఉపాధి పథకంలో తప్పుడు మస్టర్లపై విచారిస్తాం. అక్రమాలకు పాల్పడిన ఫీల్డ్ అసిస్టెంట్‌లపై చర్యలు తీసుకుంటాం. పనులు చేసే చోట ఇకపై తనిఖీలు చేస్తాం. రెండు నెలలు నుంచి మండలంలో చేసిన పనులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు వేసిన మస్టర్లును క్షుణంగా తనిఖీ చేస్తాం. అవినీతికి పాల్పడినట్లు తేలితే చర్యలు తీసుకుంటాం. నిధులను రికవరీ చేస్తాం.

- పోలేరయ్య, ఏపీఓ



అధికారుల నిర్లక్ష్యం..

డ్వామా అధికారులు నిర్లక్ష్యం కారణంగా ఉపాధి హామీ పథకంలో అక్రమాలు జరుగుతున్నాయి. అవినీతి జరుగుతోందని ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఫీల్డ్ అసిస్టెంట్లు వైసీపీ తరఫున ప్రచారం చేశారు. ఆ పార్టీకి చందాలు ఇచ్చారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించిన చాలామందిపై చర్యలు తీసుకోలేదు. వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం.

- నల్లప్ప, సీపీఎం జిల్లా నాయకుడు

రికవరీ చేయాలి..

ఉపాధి హామీ పథకంలో గత మూడు నెలలో ఫీల్డ్ అసిస్టెంట్లు విచ్చలవిడిగా అవినీతికి పాల్పడ్డారు. దొంగ మస్టర్లు వేసి అందులో వచ్చిన అవినీతి సొమ్మును వైసీపీ నేతలకు చందాలు ఇచ్చారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉపాధి హామీ పథకంలో జరిగిన అక్రమాలపై విచారణ జరపాలి. కాజేసిన సొమ్మును రికవరీ చేయాలి.

- పర్వతనేని శ్రీధర్‌బాబు,
టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి



ఎవరు గెలిచినా మీదే గెలుపు

జిల్లా స్థాయి కూపన్ నెం.6

పాఠకుని పూర్తి పేరు : ....

డోరు నెంబరు : .... వీధి పేరు : ....

గ్రామం/పట్టణం : .... మండలం : ....

జిల్లా : .... పోస్టల్ పిన్‌కోడ్ : .... ఫోన్ నెం. ....

అనంతపురం ఉమ్మడి జిల్లాలోని ఒకొక్క అసెంబ్లీ స్థానంలో ఎవరు గెలుస్తారు అనేది, మీరు ఊహించిన అభ్యర్థి ఎదురుగా గడిలో టిక్ ✔ మార్క్ చేయండి.

నియోజకవర్గం పేరు	NDA కూటమి	YSRCP	కాంగ్రెస్	ఇతరులు
1. అనంతపురం అర్బన్				
2. రాప్తాడు				
3. శింగనమల				
4. తాడిపత్రి				
5. గుంతకల్లు				
6. ఉరవకొండ				
7. కళ్యాణదుర్గం				
8. రాయదుర్గం				
9. ధర్మవరం				
10. కదిరి				
11. పుట్టపర్తి				
12. పెనుకొండ				
13. హిందూపురం				
14. మడకశిర				
మొత్తం :				

కూపన్ పూర్తి చేసి వెంటనే ఈ దిగువ అడ్రస్‌కు పోస్టు ద్వారా గానీ, పర్సనల్‌గా గానీ పంపే ఏర్పాటు చేయండి

ఆంధ్రజ్యోతి కార్యాలయం : సర్వే నెం. 239-2ఎ, బెంగళూరు బైపాస్, కక్కలపల్లి క్రాస్, అనంతపురము- 515001.

ఏపీటీఎఫ్ జిల్లా కార్యవర్గం ఎన్నిక



రామానాయక్ | శ్రీనివాస నాయక్


అనంతపురం విద్య, మే 17 : ఏపీటీఎఫ్ అనంతపురం జిల్లా కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రంలోని ఉపాధ్యాయభవన్‌లో ఆ సంఘం కౌన్సిల్ సమావేశం జిల్లా అధ్యక్షుడు రవీంద్ర అధ్యక్షతన నిర్వహించారు. ఎన్నికల పరిశీలకుడు విశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా రామానాయక్, ప్రధానకార్యదర్శిగా శ్రీనివాస్‌నాయక్, ఉపాధ్యక్షుడిగా రామాంజనేయులు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా పోతులయ్య, అదనపు కార్యదర్శిగా ఆంజనేయులు నాయక్, జిల్లా సబ్ కమిటీ సభ్యులుగా వజీర్ బాషా, సాయినాథ్ రెడ్డి, బహేశ్వర్, రామకృష్ణ, రమేష్‌రెడ్డి, మద్దిలేటప్ప, అశోక్ నాయక్, నాగార్జున, నారాయణరెడ్డి, నరసింహులును ఎన్నుకున్నారు. కొత్త సభ్యులకు రాష్ట్ర, జిల్లా నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం ప్రెస్‌క్లబ్, మే 17: జీసస్ నగర్‌లోని మైనార్టీ ప్రీమెట్రిక్ బాలికల వసతిగృహంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని మైనార్టీ సంక్షేమశాఖ ఉమ్మడి జిల్లా ఏడీ రామసుబ్బారావు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. వసతిగృహంలో 6 నుంచి 10వ తరగతి వరకు 100 ఖాళీలు ఉన్నాయని తెలిపారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థినులు వసతిగృహానికి 5 కి.మీ. పరిధిలో ఉండాలని, రేషన్‌కార్డు, ఆధార్ కార్డు దరఖాస్తుకు జతపరచాలని సూచించారు. ముస్లిం, క్రైస్తవ, సిక్కు, పారశీకులు, బౌద్ధులకు 87 శాతం, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ విద్యార్థులకు 10 శాతం, దివ్యాంగులకు 3 శాతం సీట్లు కేటాయిస్తామని తెలిపారు. వివరాలకు 9703942423 నంబరులో సంప్రదించాలని సూచించారు.

హింసపై దర్యాప్తునకు సిట్

అనంతపురం క్రైం, మే 17: పోలింగ్ అనంతరం జరిగిన హింసాత్మక ఘటనలపై విచారణకు కేంద్ర ఎన్నికల సంఘం స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్‌ను(సిట్) ఏర్పాటు చేసింది. ఐజీ వినీత్ బ్రిజిలాల్ నేతృత్వంలో 13మంది సభ్యులు ఈ బృందంలో ఉన్నారు. తాడిపత్రి అల్లర్లు రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపిన విషయం తెలిసిందే. సిట్ నివేదిక తరువాత ఎన్నికల నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించిన అధికారులు, సిబ్బంది, పోలీసులు, రౌడీమూకలపై చర్యలు తప్పవనే విషయం స్పష్టమవుతోంది.



విత్తన వేరుశనగ సబ్సిడీ ధరలు ఖరారు

- కే - 6 రకం క్వింటా రూ.9,500
- 40 శాతం సబ్సిడీ వర్తింపు
- రైతు వాటా క్వింటాల్‌కు రూ.5,700
- కదిరి లేపాక్షి రకం.. రూ.8,700
- రైతు వాటా రూ.5,220
- నేటి నుంచి రిజిస్ట్రేషన్



అనంతపురం అర్బన్, మే 17 : విత్తన వేరుశనగ సబ్సిడీ ధరలు ఎట్టకేలకు ఖరారు చేశారు. కే- 6 రకం వేరుశనగ క్వింటా పూర్తి ధర రూ.9,500గా నిర్ణయించారు. ఈ సారి 40 శాతం సబ్సిడీ వర్తింపజేయనున్నారు. ఈ లెక్కన క్వింటాకు సబ్సిడీ మొత్తం రూ.3,800 పోను రైతు వాటా క్వింటాల్ ధర రూ.5,700 చెల్లించాల్సి ఉంటుంది.

● కదిరి లేపాక్షి రకం వేరుశనగ పూర్తి ధర రూ.8700గా నిర్ణయించారు. ఇందులో 40 శాతం సబ్సిడీ మొత్తం రూ.3,480 పోను రైతు వాటా క్వింటాల్‌కు రూ.5,220 చెల్లించాల్సి ఉంటుంది. ఒక్కో రైతుకు గరిష్ఠంగా మూడు బస్తాల దాకా పంపిణీ చేయనున్నారు. ఒక్కో రైతుకు అర్ధ ఎకరా దాకా ఒక బస్తా (30కేజీల) విత్తన వేరుశనగ పంపిణీ చేస్తారు. అర్ధ ఎకరా నుంచి ఒక ఎకరా దాకా రెండు బస్తాలు (60 కేజీలు) , ఎకరాపైగా భూమి కలిగిన రైతులకు 3 బస్తాలు (90కేజీలు) పంపిణీ చేయనున్నారు. అలాగే పచ్చిరొట్టె ఎరువులు జీలు, జనుము, పిల్లిపెసరలకు 50 శాతం సబ్సిడీ వర్తింపజేశారు. వేరుశనగతోపాటు అంతర పంటల ధరలు ఒకే సారి ఖరారు చేస్తామని చెప్పిన రాష్ట్ర ఉన్నతాధికారులు అంతర పంటల విత్తనాల సబ్సిడీ ధరలు ఖరారు చేయకపోవడం గమనార్హం.

81,832 క్వింటాళ్ల కేటాయింపు

జిల్లాకు ఈ ఏడాది ఖరీఫ్‌కు 81,832 క్వింటాళ్ల వివిధ రకాలు విత్తనాలు కేటాయించారు. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో వేరుశనగ 76,710 క్వింటాళ్లు కేటాయించారు. కంది 2,300, మినుములు 46, పెసలు 85, రాగి 4, కొర్ర 50, వరి 1600, జీలుగ 200, పిల్లపెసర 25, ఉలవలు 700, అలసంద 106, జనుము 7 క్వింటాళ్ల చొప్పున కేటాయించారు.

పచ్చిరొట్ట ఎరువుల సబ్సిడీ ధరలు

పచ్చిరొట్ట ఎరువులైన జీలు, జనుము, పిల్లిపెసరలకు 50 శాతం సబ్సిడీ వర్తింప జేశారు. జీలుగ క్వింటా పూర్తి ధర రూ.8,800 కాగా 50 శాతం సబ్సిడీపోను రైతు వాటా కింద రూ.4,400 చెల్లించాలి. జనుము పూర్తి ధర రూ.8,800లు కాగా రైతు వాటా కింద రూ.4,400 చెల్లించాల్సి ఉంటుంది. పిల్లిపెసర క్వింటా పూర్తి ధర రూ.13,400గా నిర్ణయించారు. ఇందులో సబ్సిడీపోను రైతు వాటా కింద రూ.6700లు చెల్లించాలి.

బస్తాల వారీగా ధరల వివరాలిలా..

వేరుశనగ రకం	మోతాదు	పూర్తి ధర	సబ్సిడీ మొత్తం	రైతు వాటా
కే - 6	బస్తా (30 కేజీలు)	రూ.2850	రూ.1140	రూ.1710
కే - 6	2 బస్తాలు(60కేజీలు)	రూ.5700	రూ.2280	రూ.3420
కే - 6	3 బస్తాలు(90కేజీలు)	రూ.8550	రూ.3420	రూ.5130
కదిరి లేపాక్షి	బస్తా (30 కేజీలు)	రూ.2610	రూ.1044	రూ.1566
కదిరి లేపాక్షి	2 బస్తాలు(60కేజీలు)	రూ.5220	రూ.2088	రూ.3132
కదిరి లేపాక్షి	3 బస్తాలు(90కేజీలు)	రూ.7830	రూ.3132	రూ.4698

నేటి నుంచి రిజిస్ట్రేషన్

జిల్లాలోని రైతు భరోసా కేంద్రాల్లో శనివారం నుంచి విత్తన వేరుశనగ కోసం రైతులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తైన తర్వాత ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పంపిణీ తేదీని త్వరలో ప్రకటిస్తామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



మండలాల వారీగా విత్తన వేరుశనగ కేటాయింపులు

ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జిల్లాకు 71,550 క్వింటాళ్ల విత్తన వేరుశనగ కేటాయించారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని 31 మండలాలకు విత్తన వేరుశనగను కేటాయించారు. ఆయా మండలాల నుంచి వ్యవసాయ అధికారుల నివేదికల ఆధారంగా వేరుశగను కేటాయించినట్లు సమాచారం. జిల్లాలోని ఆరు వ్యవసాయ డివిజన్ల పరిధిలోని 31 మండలాలకు విత్తన వేరుశనగ కేటాయించారు. అత్యధికంగా గుమ్మగట్టకు 4500, ఆ తర్వాత బ్రహ్మసముద్రం, కళ్యాణదుర్గం మండలాలకు 4400 క్వింటాళ్ల చొప్పున, గుత్తి, శెట్టూరు మండలాలకు 4300 చొప్పున కేటాయించారు. రాయదుర్గం 4000, కుందుర్పి 3900 , గుంతకల్లు 3600, రాప్తాడు, వజ్రకరూరు 3000, కణేకల్లు 2700, కూడేరు 2500 క్వింటాళ్లు కేటాయించారు. అత్యల్పంగా పెద్దపప్పూరు, పుట్లూరు, తాడిపత్రి మండలాలకు 100 క్వింటాళ్ల చొప్పున కేటాయించారు.



సెట్ అయ్యేదెన్నడో..?

- ఈఏపీ'సెట్' రాయాలంటే పక్క జిల్లాలకు వెళ్లాల్సిందే..
- సరిపడా కంప్యూటర్లు లేవు..
- తల్లిదండ్రుల ఆగ్రహం

అనంతపురం సెంట్రల్, మే 17: అత్యాధునిక సాంకేతికత అభివృద్ధి చెందిన కాలంలోనూ విద్యార్థులకు పరీక్షా కష్టాలు తప్పడం లేదు. కష్టపడి చదివి పరీక్ష రాస్తామంటే జిల్లాలో కనీసం కంప్యూటర్లు ఏర్పాటు చేయలేని స్థితిలో అధికారులు ఉన్నారంటూ విద్యార్థులు, తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బీటెక్‌లో ఇంజనీరింగ్, బయో టెక్నాలజీ, డెయిరీ టెక్నాలజీ, అగ్రికల్చర్ ఇంజనీరింగ్, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, బీఫార్మసీ, ఫార్మ-డీ బీఎస్సీలో అగ్రికల్చర్, హార్టికల్చర్, నర్సింగ్ కోర్సుల ప్రవేశాలకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఈఏపీసెట్)ను నిర్వహిస్తోంది. ఆన్‌లైన్ ద్వారా నిర్వహించే ఈ పరీక్షలకు తగిన కేంద్రాలను ఏర్పాటు చేయడంలో అధికారులు విఫలం అవుతున్నారు. విద్యార్థులకు స్థానిక ప్రాంతాల్లో పరీక్షా కేంద్రాలను కేటాయించాల్సి ఉండగా ఇతర జిల్లాల్లో కేటాయిస్తున్నారు. దీంతో వ్యయ ప్రయాసాలకోర్చి వందల కిలోమీటర్ల దూరంలోని కేంద్రాలకెళ్లి పరీక్షలు రాయాల్సిందేనని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వంపై మండిపడుతున్నారు. ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహిస్తున్నామన్న విషయం తెలిసి కూడా విద్యార్థుల సంఖ్యకు సరిపడా కంప్యూటర్లను సమకూర్చి తగిన కేంద్రాలను చేయకపోవడంతో ఇబ్బందులకు గురికావాల్సి వస్తోందని వాపోతున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే.. వేలాదిమంది విద్యార్థులు దరఖాస్తు చేసుకుంటున్నారని అయితే పరీక్షలు రాసేందుకు పనికివచ్చే కంప్యూటర్లు తగినన్ని లేవని అధికారులు వాపోతున్నారు. ఈఏపీసెట్ నిర్వహణలోపం స్పష్టంగా కనిపిస్తోందని, అధికారులు వచ్చే ఏడాదికైనా మారాలని, విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు.

1827 కంప్యూటర్లే...

ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి ఏటా వేలాదిమంది విద్యార్థులు ఈఏపీసెట్‌కు దరఖాస్తు చేసుకుంటున్నారు. ఆన్‌లైన్ ద్వారా నిర్వహించే పరీక్షలు కావడంతో తగిన కంప్యూటర్లు ఏర్పాటుచేయాల్సి వుంది. కేవలం 1827 కంప్యూటర్లను మాత్రమే ఏర్పాటుచేసి చేతులు దులుపుకుంటున్నారు. అనంతపురం ఆరు పరీక్ష కేంద్రాల్లో 1175, గుత్తి కేంద్రంలో 250, పుట్టపర్తి కేంద్రంలో 120, తాడిపత్రి కేంద్రాల్లో 300 మొత్తం 1827 కంప్యూటర్లున్నాయి. ఫార్మసీ, అగ్రికల్చర్ రెండు రజులు. ఇంజనీరింగ్ స్ట్రీమింగ్ నాలుగు రోజుల పాటు రెండు సెషన్‌లలో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. సెషన్‌ల స్లాట్ భర్తీ అయిన తరువాత ఇతర జిల్లాల్లో స్లాట్ కేటాయిస్తామని అధికారులు పేర్కొంటున్నారు.

ఇంజనీరింగ్ స్ట్రీమింగ్ ప్రారంభం

16న ప్రారంభమైన ఈఏపీసెట్ పరీక్షలు మొదటి రెండురోజు అగ్రికల్చర్, ఫార్మసీ స్ట్రీమింగ్ పూర్తి అయింది. శనివారం ఇంజనీరింగ్, బయో టెక్నాలజీ, డెయిరీ టెక్నాలజీ, అగ్రికల్చర్ ఇంజనీరింగ్ స్ట్రీమింగ్ పరీక్షలు జరిగాయి. అనంతపురంలో ఆరు, తాడిపత్రిలో రెండు కేంద్రాలతోపాటు గుత్తి, పుట్టపర్తిలో ఒకటి చొప్పున మొత్తం పది కేంద్రాలను ఏర్పాటు చేశారు. 23వరకు నిర్వహించే పరీక్షలకు మొత్తం 15,948మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

ఆప్షన్ మేరకే కేటాయింపు

ప్రొఫెసర్ వెంకటరెడ్డి, ఈఏపీసెట్ కన్వీనర్

దరఖాస్తు సమయంలో విద్యార్థులు ఇచ్చుకున్న ఆప్షన్ల మేరకే పరీక్షా కేంద్రాల కేటాయింపు జరుగుతుంది. ఆరు ప్రాంతాలను టెస్ట్ సెంటర్ ప్రిఫరెన్స్ ఆప్షన్‌లో ఇచ్చాము. వారికి సమీప ప్రాంతాలనే ఆప్షన్లు పెట్టుకుంటారు. అయితే ఆలస్యంగా దరఖాస్తు చేసుకున్న వారి సమీప ప్రాంతాల కేంద్రాల్లో అప్పటికే స్లాట్ పూర్తి అయివుంటే ఆయా ప్రాంతాలు ఆప్షన్లు పెట్టుకోవడానికి కనిపించవు. దీంతో ఇతర ప్రాంతాలను ఆప్షన్లుగా ఇచ్చివుంటారు. మొదటి మూడు ఆప్షన్లకు ప్రాధాన్యమిచ్చి కేంద్రాలు కేటాయించాము. విద్యార్థులు ముందు దరఖాస్తు చేసుకుంటే సమస్య ఉత్పన్నమయ్యే ప్రశ్నే ఉండదు.



నంజుండ దంపతులు

ఆధార్‌లేని బతుకులు..!

కొత్తచెరువు, మే 17: ఆ దంపతులు అభాగ్యులు. నిర్భాగ్యులు. ఐదు పదుల వయసొచ్చినా కనీస గుర్తింపు లేదు. ఆధార్ కార్డు కూడా లేదు, రేషన్ కార్డు లేదు. దీంతో ప్రభుత్వ పథకాలేవీ వర్తించవు. చిత్తు పేపర్లు ఏరుకోవడం, గుజిరీకి అమ్ముకోవడం వచ్చిన సొమ్ముతో బతుకు వెల్లదీయడం. తల దాచుకునేకునేందుకు సొంత గూడు లేదు, తినడానికి కడుపునిండా తిండి దొరకదు. ఆలయాల వద్ద, రోడ్డు పక్కన పడుకోవాల్సిందే. తిండి దొరికితే తినడం, లేదంటే పస్తులుండడమే. ఇలాంటి వారి పట్ల పాలకులు, అధికారులు కనీస కనికరం చూపట్లేదు. మండల కేంద్రంలోని ముస్లిం కాలనీలో పాడుబడిన గుడిసెలో నివాసముంటున్న నంజుండ దంపతుల దీనస్థితి ఇది. ఇప్పటి వరకు వారికి ఆధార్‌కార్డు కూడా లేదు. దీంతో ప్రభుత్వ పథకాలు వీరికి అందడంలేదు. పేపర్లు, అట్టపెట్టెలు, సీసాలు సేకరించి, గుజిరీకి వేసి తద్వారా వచ్చే సొమ్ముతో బతుకీడుస్తున్నారు. ఇల్లు లేక ఖాళీగా ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు, దుకాణాలు, దేవాలయాల వద్ద ఉంటూ కాలం వెల్లదీస్తున్నారు. ఆధార్ కార్డు లేనిదే రేషన్ కార్డు ఇవ్వలేమని సచివాలయ సిబ్బంది చెబుతున్నారు. రేషన్ కార్డు లేకుండా ఇంటి పట్టా మంజూరు చేయలేమంటున్నారు. ఆధార్ కార్డు కోసం కార్యాలయం చుట్టూ తిరిగినా అందుకు అవసరమైన గుర్తింపు కార్డులు లేకపోవడంతో ఆ దంపతులకు మంజూరు చేయలేదు. ఓటరు కార్డు కూడా లేకపోవడంతో పాలకులు, రాజకీయ పార్టీల నాయకులు పట్టించుకోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, ఆ దంపతులకు ఆధార్‌కార్డు మంజూరు చేయించి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని కోరుతున్నారు.

నొక్కేశారా?

- పోలింగ్ సిబ్బందికి రెమ్యునరేషన్ చెల్లింపులో తేడాలు
- రిటర్నింగ్ అధికారుల ఇష్టారాజ్యంపై విమర్శలు



అనంతపురం టౌన్, మే 17

● ఎన్నికల విధుల్లో భాగంగా రాప్తాడు నియోజకవర్గంలో పనిచేస్తున్న చాలామంది టీచర్లు, ఇతరశాఖల ఉద్యోగులను మడకశిర నియోజకవర్గానికి పంపారు. అక్కడ పోలింగ్ నిర్వహణ సిబ్బందికి పీఓలు, ఏపీఓలకు రూ.1400, ఓపీఓలకు రూ.500 ఇచ్చి పంపించారు.

● అదే శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గంలో పనిచేసిన పీఓలు, ఏపీఓలకు రూ.1650, ఓపీఓలకు రూ.650 ఇచ్చారు.

● ధర్మవరం నియోజకవర్గంలో ఎన్నికల డ్యూటీ చేసిన పీఓలు, ఏపీఓలకు రూ 1400, ఓపీఓలకు రూ.500 ఇచ్చారు.

● అనంతపురం అర్బన్ నియోజకవర్గం జనశక్తి నగర్, తపోవనం, రాజీవ్‌కాలనీలో పనిచేసిన పీఓలు, ఏపీఓలకు రూ.2,050, ఓపీఓలు నలుగురు ఉంటే ఇద్దరికి రూ.1,300, మరో ఇద్దరికి రూ.1,050 ఇచ్చి పంపించారు. ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే.

పోలింగ్ సిబ్బందికి రెమ్యునరేషన్ చెల్లింపులో తేడాలపై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కొన్నిచోట్ల ఎక్కువగా చెల్లించడం, మరికొన్ని చోట్ల తక్కువగా చెల్లించడంపై ఎన్నికల విధుల్లో పాల్గొన్న సిబ్బంది అసహనం వ్యక్తం చేస్తున్నారు. డబ్బుల కొరతతో ఇలా చేశారా? లేక ఉన్నతాధికారులు మింగేశారా? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. సాధారణంగా ఎన్నికల నిర్వహణలో కీలక పాత్ర పోలింగ్ సిబ్బందిదే. క్షేత్రస్థాయిలో ఎన్ని ఇబ్బందులు ఎదురైనా అధికారుల ఆదేశాలను సక్రమంగా అమలు చేసేది వీరే. ప్రశాంతంగా పోలింగ్ జరగడానికి పోలింగ్ సిబ్బంది ఎంతో శ్రమిస్తారు. ఉమ్మడి జిల్లాలో పోలింగ్ నిర్వహణ కోసం 24,701 మంది పీఓలు, ఏపీఓలు, ఓపీఓలను అధికారులు నియమించారు. ఇందులో శ్రీసత్యసాయి జిల్లాలో 1571 పోలింగ్ కేంద్రాలకు 1873మంది పీఓలు, 1868మంది ఏపీఓలు, 7144మంది ఓపీఓలను నియమించారు. అనంతపురం జిల్లాలో 2236 పోలింగ్ కేంద్రాలకు 2,236 మంది పీఓలు, 2,236 మంది ఏపీఓలు, 8944మంది ఓపీఓలను ఎన్నికల విధులకు కేటాయించారు. ప్రతి పోలింగ్‌స్టేషన్‌కు ఒక పీఓ, ఒక ఏపీఓ, నలుగురు ఓపీఓలు ఉంటారు. ఎన్నికలు ముగిసిన తర్వాత పోలింగ్ సిబ్బందికి రెమ్యునరేషన్ ఇవ్వాల్సి ఉంటుంది. శ్రీసత్యసాయి జిల్లాలో సిబ్బందికి తక్కువగా డబ్బులు ఇచ్చి రిటర్నింగ్ అధికారులు చేతులు దులుపుకున్నారు. కనీసం పీఓ, ఏపీఓలకు ఒక్కొక్కరికి రూ.500నుంచి రూ.600 వందల వరకు కోత పెట్టి పంపారు. అనంత జిల్లాలో మాత్రం పీఓలు, ఏపీఓలకు ప్రతి చోటా రూ.2000 నుంచి రూ.2050 వరకు ఇచ్చారు. అయితే ఓపీఓల రెమ్యునరేషన్ విషయంలో మాత్రం కొందరికి రూ.1050 మరికొందరికి రూ. 1300 ఇచ్చారు. ఇక్కడ మరో విచిత్రమేమిటంటే ఒకే పోలింగ్ కేంద్రంలో నలుగురు ఓపీఓలు పనిచేస్తే అందులో ఇద్దరికి రూ.1050లు, మరో ఇద్దరికి రూ.1300 ఇచ్చారు. ఇది ఎందుకు ఇలా ఇచ్చారో అంతుబట్టని ప్రశ్నగా మిగిలింది.



పోలింగ్ విధుల్లో సిబ్బంది (ఫైల్)

డబ్బు కొరతా... చేతివాటమా?

ఎన్నికల నిర్వహణకు నిధులు పుష్కలంగా విడుదల చేస్తారు. జిల్లా ఎన్నికల అధికారి సైతం నిబంధనల మేరకు ఆయా పనుల నిమిత్తం నిధులు విడుదల చేస్తుంటారు. ఈ నిధులను రిటర్నింగ్ అధికారులు ఖర్చు పెట్టాల్సి ఉంటుంది. అయితే పోలింగ్ సిబ్బందికి రెమ్యునరేషన్ ఇవ్వడంలో రిటర్నింగ్ అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరించి, చేతివాటం ప్రదర్శించారన్న ఆరోపణలు ఉద్యోగ, ఉపాధ్యాయవర్గాల నుంచి వినిపిస్తున్నాయి. మడకశిరకు డ్యూటీ వేసిన ఉద్యోగుల్లో చాలా మంది అనంత జిల్లాకేంద్రంలో నివసిస్తున్నారు. ఇక్కడనుంచి మడకశిరకు ఒకసారి శిక్షణకు, ఎన్నికల రోజు వెళ్లారు. ఇక్కడనుంచి అక్కడకు వెళ్లాలంటేనే బస్సు చార్జీలే దాదాపు రూ.400 అవుతుందంటున్నారు. ఓపీఓలకు రూ.500 మాత్రమే ఇచ్చి పంపితే ఎలా సరిపోతుందో ఎన్నికల ఉన్నతాధికారులే చెప్పాలి. కొందరైతే పోలింగ్‌కు ముందు రోజు బస్సులు లేక కార్లను బాడుగలకు మాట్లాడుకొని ఆయా నియోజకవర్గాలకు వెళ్లారు. ఎన్నికల కమిషన్ నిర్ణయించిన మేరకైనా రెమ్యునరేషన్ ఇవ్వకపోతే ఎలా అని పోలింగ్‌కు వెళ్లిన సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే అసలు సమస్య ఎక్కడ వచ్చింది.. డబ్బు కొరత వల్ల ఇలా పంపిణీ చేశారా? లేక ఇచ్చిన డబ్బును ఆర్‌ఓలు, ఇతర అధికారులు నొక్కేశారా? అనే దానిపై ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు విచారించాల్సి ఉంది.

అందుబాటులో టీసీసీ సర్టిఫికెట్లు

అనంతపురం విద్య, మే 17: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు 2023 జూలై పరీక్షల్లో పాసైన అభ్యర్థుల సర్టిఫికెట్లు డీఈఓ కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయని డీఈఓ వరలక్ష్మి, ఏసీ గోవింద్ నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ లోయర్, హైయర్ గ్రేడ్ టీసీసీ-2023 సర్టిఫికెట్లు వచ్చాయన్నారు. అభ్యర్థులు తమ హాల్‌టికెట్లు, పరీక్షల్లో ఉత్తీర్ణులైన కాపీ, ఆధార్‌కార్డ్‌తో కమలానగర్‌లోని పాత డీఈఓ కార్యాలయానికి వచ్చి ఉత్తీర్ణత సర్టిఫికెట్లు పొందాలని సూచించారు.

23న ఉద్యోగ మేళా

అనంతపురం క్లాక్‌టవర్, మే 17: అమరరాజా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో నిరుద్యోగ యువతీ, యువకులకు స్టైఫండ్‌తో కూడిన ఉచిత టెక్నికల్ శిక్షణ, ఉద్యోగాల భర్తీకి ఈనెల 23న ఆర్డీటీ స్టేడియం ఎదురుగా ఉన్న ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి తెలిపారు. పదోతరగతి, ఇంటర్, ఐటీఐ చదివి 16-25 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న నిరుద్యోగ యువతీ, యువకులు అర్హులన్నారు. ఎంపికైన అభ్యర్థులకు రెండు సంవత్సరాల పాటు తిరుపతి, చిత్తూరుల్లోని అమరరాజా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లలో శిక్షణ, సర్టిఫికెట్ ఇచ్చి ఉద్యోగం కల్పిస్తామని అన్నారు. ఉచిత వసతి, భోజనం, స్టైఫండ్ చెల్లిస్తామన్నారు. వివరాలకు 90000 24919, 91004 77371, 77807 52418ను సంప్రదించాలన్నారు.

చీనీకాయలు టన్ను రూ.36 వేలు

అనంతపురంరూరల్, మే 17: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.36,500, కనిష్ఠంగా రూ.13 వేలు, సరాసరి రూ.23 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మొత్తం 1,074 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

విజయవాడ ఎక్స్‌ప్రెస్ రద్దు

గుంతకల్లు, మే17: గుంటూరు రైల్వే డివిజన్‌లో జరుగుతున్న మరమ్మతుల కారణంగా హుబ్లీ-విజయవాడ ఎక్స్‌ప్రెస్‌కు ఒక అప్ అండ్ డౌన్ సర్వీసును రద్దు చేసినట్లు శుక్రవారం రాత్రి రైల్వే అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. హుబ్లీ-విజయవాడ (నెం. 17329) ఎక్స్‌ప్రెస్‌ను ఈనెల 31న, తిరుగు రైలు (నెం. 17330)ను జూన్ 1న రద్దు చేయనున్నట్లు పేర్కొన్నారు.

గెలుపు టీడీపీదే..

మాజీ మంత్రి పరిటాల సునీత

రామగిరి, మే 17: రాష్ట్రంలో, నియోజకవర్గంలో ఖచ్చితంగా టీడీపీనే గెలుస్తుందని మాజీ మంత్రి పరిటాల సునీత ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం ఆమెను, పరిటాల శ్రీరామ్‌ను కలవడానికి రామగిరి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా వెంకటాపురానికి తరలివచ్చారు. వారితో పరిటాల సునీత మాట్లాడుతూ.. జూన్ 4న కచ్చితంగా తాము గెలవబోతున్నామని, ప్రభుత్వం రాబోతుందని ఆమె అన్నారు.

నాయిబ్రాహ్మణ సంఘం నాయకులు: పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్‌ను సత్యసాయి జిల్లా నాయి బ్రాహ్మణ సాధికార సమితి అధ్యక్షుడు రామాంజినేయులు మర్యాద పూర్వకంగా కలిశారు. పరిటాల రవీంద్ర ఘాట్‌కు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి వెంట రాప్తాడు నియోజకవర్గం సాధికార సమితి సభ్యులు కొడిమి రామకృష్ణ, అక్కమ్మ, కదిరి వేముల రామకృష్ణ కల్యాణదుర్గం నరసింహులు ఉన్నారు.




నాయకులతో చర్చిస్తున్న పరిటాల సునీత, మాజీ మంత్రితో నాయి బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు రామాంజినేయులు

రేపు ఆర్డీటీ సెట్

అనంతపురం క్లాక్‌టవర్, మే 17: ఉమ్మడి అనంతపురం, ఉమ్మడి కర్నూలు జిల్లాల్లో ఆర్డీటీ సెట్ ప్రవేశ పరీక్షను ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఆర్డీటీ ఎడ్యుకేషన్ డైరెక్టర్ మోహన్ మురళీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జిల్లాల్లో పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన మొత్తం 3,928 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని, ఈ జిల్లాల్లో మొత్తం 11 కేంద్రాల్లో ఈ పరీక్షను నిర్వహిస్తామని తెలిపారు. ఇందులో అనంతపురం రైపర్ కాలేజీలో 729 మంది, ధర్మవరం సాయికృప జూనియర్ కళాశాల 161 మంది, ధర్మవరం సీతారామయ్య జూనియర్ కళాశాలలో 397 మంది, గుత్తి గేట్స్ కాలేజీలో 299 మంది, కళ్యాణదుర్గం కరణం చిక్కప్ప ప్రభుత్వ హైస్కూల్ 283, ఉరవకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల 322, కదిరి స్పేస్ డిగ్రీ కాలేజీ 605, హిందూపురం ఎన్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల 491 మంది, ఆదోని ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాల 375 మంది, శ్రీశైలం గిరిజన గురుకుల బాలుర పాఠశాల సున్నిపెంట 53 మంది విద్యార్థులకు ఈ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. 100 మార్కులకు ఈ పరీక్ష ఉంటుందని, ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.10 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తామని అన్నారు. 360 సీట్లకు గాను 3,928 మంది దరఖాస్తు చేసుకున్నామని, వారికి ఇప్పటికే హాల్‌టికెట్లు అందజేశామని తెలిపారు. వివరాలకు 08554-271353, 271354లను సంప్రదించాలని కోరారు.

క్లీన్ అనంత హుళక్కేనా..?



త్రివేణి థియేటర్ సమీపంలో ప్రధాన కాలువ దుస్థితి



సోమనాథ్‌నగర్ వద్ద కాలువలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

అనంతపురం ప్రెస్‌క్లబ్, మే 17: ఏ సభ జరిగినా.. ఏ సమావేశం జరిగినా క్లీన్ అనంత.. గ్రీన్ అనంతే లక్ష్యమని అటు ప్రజాప్రతినిధులు, ఇటు అధికారులు ప్రసంగాలతో ఊదరగొట్టారు. అయితే చేసింది మాత్రం శూన్యం. నగర నడిబొడ్డున ఉన్న ప్రధాన కాలువ చెత్తా చెదారంతో నిండి... పిచ్చి మొక్కలు పెరిగి.. మురుగునీరు నిల్వ ఉండి.. నిత్యం కంపు కొడుతోంది. ప్రధాన మురుగు కాలువ దుస్థితే ఇలా ఉంటే.. ఇక మిగిలిన వాటి గురించి చెప్పాల్సిన అవసరమే లేదు. శుభ్రం చేయాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. చెత్తాచెదారం, వ్యర్థాలతో అవి స్తంభించిపోయాయి. అటువైపు వెళ్లే వారు భరించలేని కంపుతో ముక్కుమూసుకొని వెళ్లాల్సిన దుస్థితి ఉంది. ఆ కాలువ ప్రయాణించే కాలనీల్లో సైతం కాలువ నిర్మాణం సరిగ్గా లేకపోవడంతో వ్యర్థాలు అడ్డుపడి మురుగునీరంతా రోడ్డుపైకి వస్తోంది. ఇక వర్షాలు వస్తే ఆ మురుగునీరంతా ఇళ్లలోకే. రెండేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు ప్రధాన కాలువల సమీపంలోని ప్రాంతాలన్నీ జలమయమైన విషయం తెల్సిందే. అనేక కుటుంబాలు రోడ్డున పడ్డాయి. తీవ్రంగా నష్టపోయారు. ఆ తర్వాత అయినా పాలకులు, అధికారులు ప్రధాన మురుగు కాలువలను శుభ్రం చేసేలా చర్యలు తీసుకోకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనం.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి

నగరంలోని త్రివేణి థియేటర్ సమీపాన వెళ్లే ప్రధాన కాలువను శుభ్రం చేయకపోవడంతో ప్లాస్టిక్, థర్మాకోల్ తదితర వ్యర్థాలు పేరుకుపోయాయి. మురుగంతా స్తంభించింది. ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆ కాలువ వెళ్లే కాలనీల ప్రజలు సైతం నిత్యం అనారోగ్యాల బారిన పడుతున్నారు. నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం పెరిగిపోయింది. ప్రతి శుభకార్యంలోనూ కనీసం ఒక ట్రాక్టర్ వ్యర్థాలు బయటపడుతున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలి.

- డా. ఎం. సురేష్‌బాబు, రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు

రోడ్డు ప్రమాదంలో వడ్రంగి దుర్మరణం



వేణు ఆచారి (ఫైల్)

గార్లదిన్నె, మే 17 : అనంతపురం రూరల్ పరిధి పాములరాయి సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గార్లదిన్నెకు చెందిన వడ్రంగి వేణు ఆచారీ (53) మరణించాడు. గార్లదిన్నెకు చెందిన నారాయణస్వామి అల్లుడు వేణు ఆచారీ. ఇద్దరు వడ్రంగి పనిచేసుకుంటు కుటుంబాలను పోషించుకునేవారు. శుక్రవారం తెల్లవారుజామున వారిద్దరూ ఆటోలో అనంతపురానికి బయలుదేరారు. పాములరాయి సమీపంలోకి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన దున్నపోతుపై ఆటో ఎక్కడంతో అది అదుపుతప్పి... బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వేణు ఆచారీ తీవ్రంగా, నారాయణస్వామి స్వల్పంగా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ వేణు ఆచారీ మరణించాడు. అతనికి భార్య మల్లేశ్వరీ, ఇద్దరు కుమారులున్నారు. అనంతపురం రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్కేయూ నిధులు రికవరీ చేయాలి : ఏఐఎస్ఎఫ్



వీసీ హుస్సేన్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

అనంతపురం సెంట్రల్, మే 17: ఎస్కేయూ నిధులను మాజీ వీసీ రామకృష్ణారెడ్డి దుర్వినియోగం చేశారని, వాటిని అతని నుంచి రికవరీ చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వీసీ హుస్సేన్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్‌బాబు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమణయ్య, కుళ్లాయిస్వామి మాట్లాడుతూ... విద్యార్థులపై ఫీజుల రూపంలో భారాన్ని మోపి రూ.లక్షలు వసూలు చేశారన్నారు. వాటితో రామకృష్ణారెడ్డి తన కుటుంబసభ్యులు విహార యాత్రలు, పెళ్లి తదితర వేడుకలకు వినియోగించుకున్నాడని మండిపడ్డారు. రోడ్లు, భవనాల నిర్మాణ కాంట్రాక్టర్లు, ప్రమోషన్లు పొందిన ఉద్యోగులతో దాదాపు రూ.5కోట్లు దండుకుని వెళ్లాడన్నారు. ఫీజులు కట్టలేదని విద్యార్థులకు పరీక్షలు నిర్వహించకుండా హాస్టల్స్ నుంచి పంపివేసి భవిష్యత్తును నాశనం చేసివెళ్లిపోయాడని మండిపడ్డారు. బాధ్యతగల పదవిలో ఉంటూ ఇలాంటి అక్రమాలకు పాల్పడిన రామకృష్ణారెడ్డిపై కేసు పెట్టి విజిలెన్స్ కమిటీ ఏర్పాటుచేసి విచారణ చేపట్టాలని కోరారు. సొమ్మును రాబట్టకుంటే ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు మంజునాత్, ఉమామహేష్, వంశీ పాల్గొన్నారు.

విద్యా వ్యాపారాన్ని అడ్డుకోండి : ఎస్ఎఫ్ఐ



ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

అనంతపురం కల్చరల్ / విద్య, మే 17 : విద్య పేరుతో వ్యాపారానికి పాల్పడుతున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ఓ కార్పొరేట్ కళాశాల ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించిన ఆయన మాట్లాడారు. పుస్తకాలు, యూనిఫాంలు విక్రయిస్తూ అక్రమంగా వ్యాపారాలకు పాల్పడుతున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విద్యాసంవత్సరం ప్రారంభం కాకముందే జిల్లావ్యాప్తంగా పలు విద్యాసంస్థలు విద్య మాఫియాను ప్రారంభించాయని విమర్శించారు. ఈ విషయం తెలిసినా జిల్లా ఉన్నత విద్యాశాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. దీనిపై జిల్లా ఇంటర్మీడియట్ ఆర్ఐఓకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయగా.. తాను సెలవులో ఉన్నాని, ఇపుడేమీ చేయలేనని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సిద్దు, గిరి, సహాయ కార్యదర్శి సూర్య, భీమేష్, మహేష్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అడిగిన వెంటనే ఉపాధి పనులు



తరిమెల వద్ద ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఏపీఓ శ్రీదేవి

శింగనమల మే 17: ఉపాధి హామీ పథకంలో కూలీలు అడిగిన వెంటనే పనులను కల్పిస్తామని ఏపీఓ శ్రీదేవి అన్నారు. మండలంలోని తరిమెల, శింగనమల గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను శుక్రవారం పరిశీలించిన ఆమె మాట్లాడారు. ఉపాధి కూలీలు పనులను సద్వినియోగం చేసుకోవాలని, మండలంలో రోజురోజుకు కూలీల సంఖ్య పెరుగుతోందని, జాబ్ కార్డు ఉన్న కూలీలందరూ ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. చేసిన పనులకు సకాలంలో బిల్లులు చెల్లిస్తామన్నారు.

రామగిరిలో మోస్తరు వర్షం

రామగిరి : మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. పేరూరు, ఆర్‌కొత్తపల్లి, దుబ్బార్లపల్లి తదితర గ్రామాల్లో ఓ మోస్తరు వర్షం కురవగా.. రామగిరితో పాటు పలు గ్రామాల్లో వర్షం పడింది. ఈ వర్షంతో వాతావరణం చల్లబడింది.

అర్హులందరికీ సబ్సిడీ విత్తనకాయలు : కలెక్టర్




లోలూరు క్రాస్ వద్ద వేరుశనగ కాయలను పరిశీలిస్తున్న కలెక్టర్, గార్లదిన్నెలో విత్తనకాయలను పరిశీలిస్తున్న ఏడీఏ, ఏఓ

శింగనమల, మే 17: జిల్లాలోని అర్హత గల రైతులందరికీ సబ్సిడీ వేరుశనగ విత్తన కాయలు పంపిణీ చేస్తామని, విత్తన కాయలు నాణ్యతలో రాజీ ఉండబోదని జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. శుక్రవారం శింగనమల మండలంలోని లోలూరు క్రాస్ సమీపంలో ఉన్న సాయి విత్తన ప్రాసెసింగ్ యూనిట్‌లో విత్తనాలను ఆయన పరిశీలించారు. ప్రాసెసింగ్ యూనిట్‌లో కే6 రకం కాయలు 4000 క్వింటాళ్ల రాగా ఇప్పటి వరకు 2640 క్వింటాలు ప్రాసెసింగ్ పూర్తి చేసినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. విత్తనాల ప్రాసెసింగ్ వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, శింగనమల తహసీల్దార్ శోభన్‌బాబు, ఏవోలు రాజేష్‌నాయక్, అన్వేష్, శ్రీనివాసులు, అఖిల, సుధాకర్‌రెడ్డి ఉన్నారు.

నేటి నుంచి పేర్లు నమోదు చేసుకోండి

గార్లదిన్నె : సబ్సిడీతో వేరుశనగ విత్తన కాయలు కావాల్సిన రైతులు శనివారం నుంచి రైతు భరోసా కేంద్రాల్లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని వ్యవసాయ సంచాలకులు రవి తెలిపారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ గోడౌన్‌లో నిల్వ చేసిన వేరుశనగ విత్తన కాయాల నాణ్యతను ఏఓ సోమశేఖర్‌తో కలసి పరిశీలించిన ఆయన మాట్లాడారు. 30 కేజీల బస్తా రూ. 2850 ఉండగా 40 శాతం సబ్సిడీతో రైతు రూ. 1710 చెల్లించాలన్నారు. ఒక రైతుకు మూడు బస్తాలు చొప్పున అందచేస్తామన్నారు. వేరుశనగ విత్తన కాయలు కావాల్సిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, ఫోన్ తీసుకుని రైతు భరోసా కేంద్రాల వద్దకు రావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు రైతు భరోసా సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

ఏపీఎల్‌లో పలు జట్ల విజయం

అనంతపురం క్లాక్‌టవర్, మే17: అనంతపూర్ ప్రీమియర్ క్రికెట్ లీగ్ (ఏపీఎల్) సీజన్-2 పోటీల్లో ఇండియన్ సిక్సర్స్, ఫ్యామిలీ క్లబ్ జట్లు విజయం సాధించాయి. జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో అనంత క్రీడాగ్రామం ఆర్డీటీ స్టేడియంలో నిర్వహిస్తున్న ఏపీఎల్-2 క్రికెట్ పోటీలు నాలుగో రోజైన శుక్రవారమూ కొనసాగాయి. ఇండియన్ సిక్సర్స్, యునైటెడ్ చాంపియన్స్ జట్లు తలపడగా...మొదట బ్యాటింగ్ చేసిన ఇండియన్ సిక్సర్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో ఎనిమిది వికెట్లు కోల్పోయి 166 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన యునైటెడ్ చాంపియన్స్ జట్టు 19.2 ఓవర్లలో 140 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఇండియన్ సిక్సర్స్ బౌలర్ వినయ్‌కుమార్ మూడు వికెట్లు తీసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నాడు. దీంతో ఇండియన్ సిక్సర్స్ 26 పరుగుల తేడాతో విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో దినేష్ గ్రానైట్స్ జట్టు, ఫ్యామిలీ క్లబ్ జట్లు మధ్య జరగగా... మొదట బ్యాటింగ్ చేసిన ఫ్యామిలీ క్లబ్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో నాలుగు వికెట్లుకు 188 పరుగులు సాధించింది. ఇందులో బ్యాటర్ యోగానంద 57 పరుగులు చేసి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నాడు. అనంతరం బరిలోకి దిగిన దినేష్ గ్రానైట్స్ 18.3 ఓవర్లలో 126 పరుగులు మాత్రమే చేసి ఆలౌట్ అయ్యింది. దీంతో ఫ్యామిలీ క్లబ్ 62 పరుగుల తేడాతో గెలుపొందింది. ఈ కార్యక్రమంలో మాజీ రంజీ ప్లేయర్ సురేష్, జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి మధు ఆచారి, కోశాధికారి షబ్బీర్ అహ్మద్, సహాయ కార్యదర్శి భీమలింగారెడ్డి, ఆర్డీటీ స్టేడియం మేనేజర్ శ్రీదేవి, కోచ్‌లు పాల్గొన్నారు.



వినయ్‌కుమార్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందజేస్తున్న మేనేజర్ శ్రీదేవి

మేయర్ చాంబర్‌లో పంచాయితీ

అనంతపురం క్రైం, మే 17: ఎన్నికల కోడ్ ముగియక ముందే మేయర్, డిప్యూటీ మేయర్లు చాంబర్లు తెరచుకొని.. పంచాయితీలు నిర్వహిస్తుండటం పలు విమర్శలకు తావిస్తోంది. గురువారం నగరపాలిక డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు పలు సచివాలయాలు తనిఖీ చేశారు. యూనిఫాం వేసుకోరా... ఎవరి కుర్చీల్లో వారు కూర్చోలేరా.. అంటూ ఆయన సచివాలయ సిబ్బందిపై మండిపడ్డారు. భాష విషయంలో కొంత కఠినంగా వ్యవహరించినట్లు సమాచారం. దీనిపై మేయర్ మహమ్మద్ వసీం డిప్యూటీ కమిషనర్‌ను తన చాంబర్‌కు పిలిపించుకొని.. శుక్రవారం పంచాయితీ పెట్టారు. అలా మాట్లాడటం సబబు కాదని డిప్యూటీ కమిషనర్‌కు చెప్పారట. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా.. మేయర్ ఇలా చాంబర్‌లో పంచాయితీలు పెట్టడం ఏంటని నగరపాలికలో చర్చించుకుంటున్నారు.

నేడు వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన

శింగనమల మే 17: శింగనమల వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన కార్యక్రమాన్ని శనివారం నిర్వహిస్తున్నట్లు ఆలయ పూజారి భాస్కర్‌చారి తెలిపారు. శనివారం ఉదయం స్వామికి పంచామృత అభిషేకం, సంకల్పపూజ, పుష్పార్చన నిర్వహిస్తామని, మధ్యాహ్నం అన్నదానం ఉంటుందని, సాయంత్రం స్వాములను పురవీధులలో ఊరేగిస్తామని తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో తాగునీరూ కరువే

అనంతపురం కల్చరల్, మే 17: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో శుద్ధి తాగునీరూ కరువే. ప్రయాణికుల దాహార్తిని తీర్చడానికి ఆర్‌ఓను ఏర్పాటు చేశారు. ఆ నీటిని ఓ ఫ్రిడ్జి ద్వారా సరఫరా చేస్తూ చల్లని నీటిని అందించేవారు. అయితే ఏడాది క్రితం ఆర్వో ఫిల్టర్లు చెడిపోయాయి. అప్పటి నుంచి దాని రిపేరీ గురించి ఆర్టీసీ అధికారులు ఏ మాత్రం పట్టించుకోలేదు. ఫ్రిడ్జ్‌కు నేరుగా సాధారణ కొళాయి నీటిని సరఫరా చేస్తున్నారు. తప్పని పరిస్థితిల్లో ప్రయాణికులు ఆ నీటినే తాగుతున్నారు. ప్రయాణికులు డబ్బు పెట్టి.. తాగునీరు కొనుక్కోలేక.. కొళాయి నీటితోనే దాహాన్ని తీర్చుకొం టున్నారు. ఇలా ఆర్టీసీ అధికారులు ప్రయాణికుల ఆరోగ్యం తో ఏడాదిగా చెలగాటం ఆడుతు న్నారు. కనీసం ఎండాకాలంలోనూ ఆ ఆర్వో ఫిల్టర్లకు మరమ్మతులు చేపట్టలేదు. ప్రయాణికులు ద్వారా ఆర్టీసీకి అంత ఆదాయం వస్తున్నా.. కనీసం శుద్ధి తాగునీటిని అందిం చడంలో అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారు. ఆర్‌ఓ ఫిల్టర్లు రిపేరీ చేయిస్తే



ఫ్రిడ్జు ద్వారా వస్తున్న కొళాయి నీటిని తాగుతున్న ప్రయాణికుడు

ఏడాదిగా కొళాయి నీరే గతి

ప్రయాణికుల ఆరోగ్యంతో చెలగాటం

నిర్లక్ష్యం వీడని అధికారులు

బస్టాండులోని దుకాణాల్లో ప్రయాణికులు వాటర్ బాటిళ్లు కొనుగోలు చేయరని దుకాణాల నిర్వాహకులు, ఆర్టీసీ అధికారుల లోలోపు ఒప్పందం వల్లే అధికారులు ఫిల్టర్లను రిపేరీ చేయించడం లేదనే విమర్శలూ ఉన్నాయి. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు తమ దాహార్తిని తీర్చేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నిర్లక్ష్యం వీడాలి..: రహమత్ బాషా, ప్రయాణికుడు

నేను కర్నూలులో ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నా. వారానికి రెండుసార్లు అనంతపురంలోని మా ఇంటికి వచ్చి పోతుంటా. కర్నూలు బస్టాండులో ఉచితంగా మినరల్ వాటర్ లభిస్తోంది. అనంతపురంలో మాత్రం కొళాయినీరే గతి. చాలా నెలల నుంచి ఈ సమస్య అలాగే ఉంది. ఆర్టీసీ అధికారులు ఇకనైనా నిర్లక్ష్యం వీడాలి.

రక్తపోటుపై అవగాహన ర్యాలీ



ర్యాలీ ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ

అనంతపురం టౌన్, మే 17 : రక్తపోటు (బీపీ) వల్ల సంభవించే అనర్థాలపై నగరంలో శుక్రవారం అవగాహన ర్యాలీ చేపట్టారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా తలపెట్టిన ఈ ర్యాలీని జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఈబీ. దేవి తన కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ... క్రమం తప్పకుండా బీపీని పరీక్షించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్లు సుజాత, అనుపమజేమ్స్, మహీంద్రా, గిరిజామనోహర్, ఓబులు, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, డెమోలు ఉమాపతి, త్యాగరాజు, గంగాధర్, రఫీ, విజయభాస్కర్ పాల్గొన్నారు.

మాతాశిశు మరణాలపై సమీక్ష

జిల్లాలో మాతా శిశు మరణాలపై డీఎంహెచ్ఓ తన కార్యాలయంలో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. గతనెలలో జిల్లాలో జరిగిన మరణాలకు కారణాలు గురించి సంబంధిత డాక్టర్లను ప్రశ్నించి.. అందుకు కారణాలు తెలుసుకున్నారు. ఈ సమీక్షలో ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, వైద్యులు ఇందిరాప్రియదర్శిని, అరుణ లత, శంకరనారాయణ, ఎంపీహెచ్ఓ లక్ష్మన్న, హేమలత పాల్గొన్నారు.

కలేకూరికి ఘన నివాళి



కలేకూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

అనంతపురం సెంట్రల్, మే 17: తన రచనలతో పాఠకుల్లో ఆలోచనల సెగలు పుట్టించిన కలేకూరి ప్రసాద్ వర్ధంతిని ఏఐఎస్ఏ ఆధ్వర్యంలో ఎస్కేయూలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఐఎస్ఏ రాష్ట్ర అధ్యక్షులు వేమన మాట్లాడుతూ... కలేకూరి ప్రసాద్ తన రచనలతో ప్రజల్లో చైతన్యం రగిలించాడన్నారు. కవిత, వ్యాసం, రచన, అనువాదం, విమర్శ ఏదైనా ప్రజల్లో కొత్త ఆలోచనలు పుట్టించాడన్నారు. అయితే ఎస్కేయూ తెలుగుశాఖ కలేకూరి లాంటి రచయితలకు సముచిత గౌరవం కల్పించడంలేదని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు అరుణ్‌కుమార్, తిరుమలేష్, ఎర్రిస్వామి, పరశురామ్‌నాయక్, రాజు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యోగా అంపైర్ల శిక్షణ ప్రారంభం



మాట్లాడుతున్న ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ

అనంతపురం క్లాక్‌టవర్, మే 17: రాష్ట్రస్థాయి యోగాసన అంపైర్ల శిక్షణ శిబిరాన్ని స్థానిక టెలిఫోన్ భవన్‌లో ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ శుక్రవారం ప్రారంభించారు. ప్రతి ఒక్కరి జీవితంలో ఆటలు, వ్యాయామం భాగం కావాలని, అప్పుడే ఆరోగ్యంగా, ఆనందంగా ఉంటారని అన్నారు. యోగాసన భారత్ అనే జాతీయ స్థాయి సంస్థ నిర్దేశం ప్రకారం శిక్షణ ఇవ్వడం శుభపరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు రాధిక, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజశేఖర్‌రెడ్డి, మారుతిప్రసాత్, గౌరవాధ్యక్షులు రవికాంత్ రమణ, ముఖ్యులు చార్టెడ్ అకౌంటెంట్ హరిచంద్రరామ, రాష్ట్ర కమిటీ సభ్యులు రమణ , బాలసుబ్రమణ్యం, అనీల్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి, సుమన, నిర్మల, అంపైర్లు పాల్గొన్నారు.

దారి కబ్జాను అడ్డుకోండి



ఎంపీడీఓకు ఫిర్యాదు చేస్తున్న దామాజిపల్లి గ్రామస్థులు

చెన్నేకొత్తపల్లి, మే 17: మండలంలోని దామాజిపల్లిలో దారిని కబ్జా చేసి ప్రహరీ నిర్మిస్తున్నారని, దాన్ని అడ్డుకోవాలని ఆ గ్రామస్థులు కోరుతున్నారు. ఈ మేరకు శుక్రవారం వారు ఎంపీడీఓ మోహన్‌కుమార్, ఈఓఆర్‌డీ అశోక్‌నాయక్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామస్థులు అల్లాబకాష్, రాము, షాదిక్‌వలీ, బాషా, పెక్షావలి, షాషావలి మాట్లాడుతూ... గ్రామంలోని మసీదు వీధిలో మురుగు కాలువ నిర్మాణం కోసం తవ్వడం జరిగిందని, గ్రామానికి చెందిన రామచంద్ర అనే వ్యక్తి కాలువ నిర్మాణం పనులు చేస్తున్న స్థలంలో ఇంటి ప్రహరీ నిర్మాణ పనులు చేపట్టారని అన్నారు. ఇదేమని ప్రశ్నిస్తే తాను పోలీసు శాఖకు చెందిన వ్యక్తినని, ప్రహరీని నిర్మించేది అంటూ తెగేసీ చెబుతున్నారని అన్నారు. అధికారులు విచారించి దారి ఆక్రమణకు గురికాకుండా చూడాలని వారు విజ్ఞప్తి చేశారు.

రైతులకు అందుబాటులో ఉండాలి: కలెక్టర్



ఎద్దులపల్లిలో వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ వినోద్ కుమార్

పామిడి, మే 17: మండలంలోని రెవెన్యూ, వ్యవసాయాధికారులు రైతులకు అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. మండలంలోని ఎద్దులపల్లిలో శుక్రవారం ఆయన ట్రైనీ కలెక్టర్ వినూత్నతో కలిసి పర్యటించారు. 2024 ఖరీఫ్‌లో రైతులు ఏయే పంటలను సాగు చేసేందుకు ఆసక్తిగా ఉన్నారని వ్యవసాయాధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులు వేరుశనగతో పాటు కంది, కొర్ర, ఆముదం, పత్తి పంటలను సాగు చేసేందుకు ఆసక్తిగా ఉన్నారని మండల వ్యవసాయాధికారి లీనా వసుంధర తెలియజేశారు. అనంతరం రైతు భరోసా కేంద్రంలో ఖరీఫ్‌లో రైతులకు పంపిణీ చేసేందుకు ఉంచిన విత్తన కాయలను పరిశీలించారు. మండలానికి సుమారు 1600 క్వింటాళ్లు కేటాయించినట్లు తెలిపారు. విత్తన కాయల పంపిణీలో నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని సూచించారు. అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని ఆర్బీకే సిబ్బందిని హెచ్చరించారు. రెవెన్యూ అధికారులు రైతులకు అందుబాటులో ఉండడం లేదని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. రీ సర్వేతో పంట రుణాల రెన్యువల్‌కు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు రైతులు కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగిన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారిణి ఉమామహేశ్వరమ్మ, డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీనారాయణరెడ్డి, ఎస్‌ఐ రాజు, గ్రామ సర్పంచు వెంకటరమణమ్మ, పంచాయతీ కార్యదర్శి చంద్రమౌళి, వీఆర్వో శాంతకుమారి, విలేజ్ సెరికల్చర్ అసిస్టెంట్ ఆదినారాయణ, రైతులు వీరాంజనేయులు, మధుసూదన్‌రెడ్డి, తిప్పారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ఆదినారాయణ, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక తరలింపును అడ్డుకున్న గ్రామస్థులు



ఇసుకరీచ్ వద్ద యంత్రాలను దింపిన దృశ్యం

రాయదుర్గంరూరల్, మే 17: మండలంలోని జుంజురంపల్లి ఇసుకరీచ్ వద్ద శుక్రవారం ఇసుక తరలింపు ప్రయత్నాన్ని గ్రామస్థులు అడ్డుకున్నారు. అనుమతులు లేకుండా ఇసుకరీచ్‌లో ఇసుక తరలింపునకు ఓ ప్రైవేట్ సంస్థ గుత్తేదారు యంత్రాలతో చేరుకున్నాడు. దీన్ని గమనించిన గ్రామస్థు లు ఇసుకను తరలించరాదంటూ అడ్డుకున్నారు. ఇసుక తవ్వకాలను నిర్వహించరాదంటూ కోర్టులు తీర్పులు ఇస్తున్నప్పటికీ కొంతమంది ప్రైవేటు వ్యక్తులు దౌర్జన్యంగా ఇసుకను తరలించేందుకు పూనుకోవడం ఏమిటని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇసుక తవ్వకాలను నిర్వహించరాదంటూ వారితో వాగ్వాదానికి దిగారు. ఇసుక తవ్వకాలను నిర్వహించమని నిర్వాహకులు తెలపడంతో గ్రామస్థులు వెనుదిరిగి వెళ్లారు.

కంబదూరులో టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్

కళ్యాణదుర్గం, మే 17: ఈ నెల 26 నుంచి కంబదూరులో టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శుక్రవారం పత్రికా ప్రకటనలో తెలిపారు. ఎంట్రీ ఫీజు రూ. 1500లు ఉంటుందని, ఆసక్తి గలవారు ఈ నెల25వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. విజేతలకు రూ.40 వేలు, రన్నర్స్‌కు రూ.20 వేలు నగదు బహుమతి అందిస్తామన్నారు. కంబదూరు చెరువు కట్ట వద్ద ఈ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్థానికులు మాత్రమే ఆడేందుకు అవకాశం ఉంటుందన్నారు. 8074510914, 8328556034 నెంబర్లకు సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

రోడ్డు కబ్జాను అడ్డుకోండి

చెన్నేకొత్తపల్లి, మే 17: మండలంలోని దామాజిపల్లిలో దారిని కబ్జా చేసి ప్రహరీ నిర్మిస్తున్నారని, దాన్ని అడ్డుకోవాలని ఆ గ్రామస్థులు కోరుతున్నారు. ఈ మేరకు శుక్రవారం వారు ఎంపీడీఓ మోహన్‌కుమార్, ఈఓఆర్డీ అశోక్‌నాయక్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామస్థులు అల్లాబకాష్, రాము, షాదిక్‌వలీ, బాషా, షెక్షావలి, షాషావలి మాట్లాడుతూ... గ్రామంలోని మసీదు వీధిలో మురుగు కాలువ నిర్మాణం కోసం తవ్వడం జరిగిందని, గ్రామానికి చెందిన రామచంద్ర అనే వ్యక్తి కాలువ నిర్మాణం పనులు చేస్తున్న స్థలంలో ఇంటి ప్రహరీ నిర్మాణ పనులు చేపట్టారని అన్నారు. ఇదేమని ప్రశ్నిస్తే తాను పోలీసు శాఖకు చెందిన వ్యక్తినని, ప్రహరీని నిర్మించేది అంటూ తెగేసీ చెబుతున్నారని అన్నారు. అధికారులు విచారించి దారి ఆక్రమణకు గురికాకుండా చూడాలని వారు విజ్ఞప్తి చేశారు.

కూలీల శాతాన్ని పెంచాలి

రాయదుర్గంరూరల్, మే 17: మండలంలో ఉపాధిహామీ పనుల నిర్వహణలో కూలీల శాతాన్ని పెంచాలని ఏపీఓ దేవరాజ్ పేర్కొన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాన్ని చేరుకోవాలంటే సిబ్బంది కష్టపడి పనిచేయాలన్నారు. పనుల నాణ్యత పెంచాలన్నారు. వర్క్‌ఫైల్ నిర్వహణ, ఉపాధిహామీ పనులు నిర్వహించిన చోట నేమ్‌బోర్డ్ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో టీఏలు, ఫీల్డు అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నిందితుడి అరెస్టు

బెళుగుప్ప, మే 17: మండల కేంద్రానికి చెందిన ఏపీ ప్రొవిజన్ యాక్ట్ కేసులో నిందారోపణలు ఎదుర్కొంటూ పరారీలో ఉన్న వ్యక్తిని శుక్రవారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ శివ తెలిపారు. కోర్టుకి హాజరుపరచగా రిమాండ్ విధించారన్నారు.

ప్రిన్సిపాల్‌పై ఆర్జేడీ విచారణ

ఉరవకొండ, మే17: విధి నిర్వహణలో తనను వేధిస్తున్నారంటూ రికార్డు అసిస్టెంట్ ప్రిన్సిపాల్‌పై ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆర్జేడీ నాగలింగారెడ్డి విచారణ చేపట్టారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఆర్జేడీ ఫిర్యాదురాలిని విచారించి, పేపరుపై రాయించుకున్నారు. రికార్డు అసిస్టెంట్ కల్యాణి ప్రిన్సిపాల్ తనను పని సరిగ్గా లేదంటూ దూషిస్తున్నారని, ఇక్రిమెంట్ కూడా పెండింగ్ పెట్టారని, ఉన్నత విద్యాశాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేసింది. దీంతో ఆర్జేడీ ప్రిన్సిపాల్‌ను విచారించారు. ప్రిన్సిపాల్, రికార్డు అసిస్టెంట్‌తో వివరాలు సేకరించామని నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామని ఆర్జేడీ పేర్కొన్నారు.

తాడిపత్రిలో పోలీసుల కవాతు



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

తాడిపత్రిటౌన్, మే17: పట్టణంలో వరుసగా జరుగుతున్న దాడులు, ప్రతిదాడులను దృష్టిలో ఉంచుకొని శుక్రవారం పోలీసు ఉన్నతాధికారులు సిబ్బందితో కవాతు నిర్వహించారు. పట్టణంలోని అశోక్‌పిల్లర్, సీబీరోడ్డు, పుట్లూరురోడ్డు, యల్లనూరురోడ్డు, బస్టాండ్ సర్కిల్ ప్రాంతాల్లో కవాతు నిర్వహించారు. ప్రజలు ఎవరూ భయపడాల్సిన పనిలేదని పట్టణంలో 144సెక్షన్ అమలులో ఉందని డీఎస్పీలు శ్రీనివాసులు, వెంకటశివారెడ్డి తెలిపారు.

అడుగంటిన సమ్మర్‌స్టోరేజీ ట్యాంకులు

చుక్క నీటి కోసం గ్రామాల విలవిల

ఉరవకొండ, మే17: తాగునీటి కోసం సమ్మర్ స్టోరేజీ ట్యాంకులపై ఆధారపడిన గ్రామాలు చుక్కనీరు దొరక్క విలవిల్లాడుతున్నాయి. ఉరవకొండతో పాటు నింబగల్లు, రేణుమాకులపల్లి, వ్యాసాపురం, రాయంపల్లి, నెరమెట్ల, బూదగవి వెలిగొండ గ్రామాలకు తాగునీటి సమస్య తీర్చడం కోసం నింబగల్లులో మూడు సమ్మర్‌స్టోరేజీ ట్యాంకులు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా ఈ ఏడు గ్రామాలకు నీటిని అందించాల్సి ఉంది. వేసవి నేపథ్యంలో ట్యాంకుల్లో గుక్కెడు నీరు కనిపించని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే రెండు చెరువులు పూర్తిగా ఎండిపోయాయి. దీంతో ఉరవకొండలో 20 రోజులకు ఒక్కసారి నీటిని వదులుతున్నారు. గ్రామాల్లో అయితే పరిస్థితి మరీ దారుణంగా ఉంది. కొన్ని గ్రామాల్లో కొన్ని కాలనీల్లో రెండు నెలలకు ఒక్కసారి నీటిని వదులుతున్నారు.బండల చెరువులో ఒక్క అడుగు నీరు



ట్యాంకర్‌తో నీటిని సరఫరా చేస్తున్న దృశ్యం



అడుగంటిన నింబగల్లు చెరువు

ఉంది. ఆ నీటిని మోటార్ల ద్వారా పంప్ చేసి వదిలే అవకాశమున్నా అధికారులు చర్యలు చేపట్టడం లేదు. ఉరవకొండలో ప్రజలు నీటిని కొనుక్కొని తాగాల్సిన పరిస్థితి ఏర్పడింది. వర్షాలు కురిసి హెచ్చెల్సీకి నీరు వచ్చేంత వరకూ ఈ కష్టాలు తప్పేటట్లు లేవు. పీఏబీఆర్ నుంచి ఉరవకొండకు అరకొరగా వచ్చే నీరు ఏ మూలకు సరిపోవడం లేదు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నీటి సరఫరా చేస్తున్నా ఆ నీటిని ఎవరూ వాడుకోవడం లేదు. పేరుకేమో తాగు నీటి సరఫరా అని ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ఉప్పు నీటిని సరఫరా చేస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. దీంతో ఆ ట్యాంకర్ల నీటిని పట్టుకునేందుకు ప్రజలు ఆసక్తి చూపడం లేదు.

విత్తన కొనుగోలుకు రిజిస్ట్రేషన్ చేసుకోండి

రాయదుర్గంరూరల్, మే 17: ఖరీఫ్‌లో వేరుశనగ సాగు చేసుకునే రైతులు ఈ నెల 18 నుంచి రైతు భరోసా కేంద్రాలలో విత్తన వేరుశనగ కోసం నమోదుకు చేసుకోవాలని వ్యవసాయశాఖ ఏఓ మహేంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం 40 శాతం సబ్సిడీతో ప్రతి రైతుకు నాణ్యమైన విత్తనం అందించనున్నట్లు వెల్లడించారు. ఎకరా కంటే అధికంగా భూమి ఉన్న ఒక్కో రైతుకు గరిష్ఠంగా 30 కిలోల బస్తాలు మూడు ఇవ్వనున్నట్లు తెలిపారు. సబ్సిడీ పోను ఒక్కో బస్తాకు రైతు రూ.1710లు కట్టాల్సి ఉంటుందన్నారు. ఈనెల 23 వరకు విత్తన కొనుగోలుకు నమోదు చేసుకోవాలన్నారు. 24 నుంచి విత్తన వేరుశనగ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

28న జాబ్‌మేళా

గుంతకల్లుటౌన్, మే 17: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈనెల 28న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ నరేంద్రనాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్‌అండ్‌టీ కన్‌స్ట్రక్షన్ స్కిల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నామన్నారు. 2022 నుంచి ఇప్పటి వరకు ఐటీఐ పాసైన వారు ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చన్నారు. 28న ఉదయం 10గంటలకు బయోడేటా, ఒరిజినల్, జిరాక్స్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డుతో హాజరు కావాలన్నారు. వివరాలకు సెల్:9849279880 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

అంగన్‌వాడీ సిబ్బందికి మెమోలు

గుత్తి,మే17: పట్టణంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలలో విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఏడుగురు అంగన్‌వాడీ హెల్పర్లకు మెమోలు జారీ చేసినట్లు సీడీపీఓ డిల్లీశ్వరి తెలిపారు. పట్టణంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె శుక్రవారం తనిఖీ చేశారు.



తెరచుకోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద సీడీపీఓ

ఈ సందర్భంగా ఎస్‌బీఐ, జంగాల, బీసీ, తదితర కాలనీలలోని అంగన్‌వాడీ కేంద్రాలలో హెల్పర్లు విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉంటూ, సమయ పాలన పాటించకపోవడంతో మెమోలు జారీ చేసినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగేశ్వరి పాల్గొన్నారు.

ఇసుక దిమ్మెలు మీద పడి వ్యక్తి మృతి

గుమ్మఘట్ట, మే 17: మండలంలోని గలగల గ్రామానికి చెందిన గాజుల రాజశేఖర్(43) శుక్రవారం ఉదయం ఇసుక దిమ్మెలు మీద పడి మృతి చెందాడు. గ్రామ శివారులోని చెరువువంకలో ఎద్దుల బండిలో ఇసుకను తరలించేందుకు వెళ్లాడు గోతిలో ఇసుక తవ్వుతుండగా ఇసుక దిమ్మెలు మీద పడ్డాయి. అక్కడున్న కూలీలు గమనించి వెలికి తీసేలోగా మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య భాగ్యమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. విషయం తెలియగానే కుటుంబసభ్యులు సంఘటన స్థలానికి చేరుకొని బోరున విలపించారు. ఈ సంఘటనపై గుమ్మఘట్ట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



గాజుల రాజశేఖర్ (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

రాయదుర్గంరూరల్, మే 17: పట్టణంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వాల్మీకినగర్‌కు చెందిన గంగమ్మ(68) మృతి చెందింది. వాల్మీకినగర్‌కు చెందిన గంగమ్మ ఇంటి నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తుతెలియని బొలెరో వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన ఆమెను స్థానికులు రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. కుమారుడు షైలారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఏపీటీఎఫ్ జిల్లా కార్యవర్గంలోకి మండల నాయకులు



ప్రతిజ్ఞ చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

బెళుగుప్ప, మే 17: ఏపీటీఎఫ్ (1938) జిల్లా కార్యవర్గంలో మండల నాయకులకు చోటు దక్కినట్లు ఆ శాఖ రాష్ట్ర కౌన్సిలర్ హనుమంతనాయక్, మండల అధ్యక్షుడు చెన్నబసయ్య శుక్రవారం తెలిపారు. జిల్లా ప్రధాన కార్య దర్శిగా శ్రీనివాసనాయక్, వైస్ ప్రెసిడెంట్‌గా వజీర్ బాషాలను ఎన్నుకున్నట్లు వెల్లడించారు.

ఘనంగా రథోత్సవం



పట్టణంలో రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

రాయదుర్గంరూరల్, మే 17: పట్టణంలోని లక్ష్మీబజార్‌లో వెలసిన లక్ష్మీనారాయణస్వామి రథోత్సవాన్ని శుక్రవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే స్వామివారికి గంగాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన తదితర పూజలు నిర్వహించారు. స్వామివారికి కల్యాణోత్సవ కార్యక్రమాన్ని అర్చకులు కన్నుల పండువగా నిర్వహించారు. సాయంత్రం రథాన్ని ప్రత్యేకంగా అలంకరించి స్వామివారి ప్రతిమను ప్రతిష్ఠించి ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

ఆసుపత్రి తనిఖీ

డీ.హీరేహాళ్, మే 17: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని వైద్యశాఖ డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం మేనేజ్‌మెంట్ ఆఫీసర్ రవిశంకర్ శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆసుపత్రి సిబ్బంది అందిస్తున్న సేవలు, వైద్యం గురించి రోగులు, గర్భవతులను అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్ సేవల రికార్డులను కూడా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు వైద్యసేవలు అందించడం కోసం వైద్యసిబ్బంది నిత్యం అందుబాటులో ఉండాలన్నారు. ఓపీ సేవలను ఇంకా పెంచి మెరుగైన సేవలందించేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు శ్రవణ్‌కుమార్, శివకుమార్, ప్రసాద్ పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో మోస్తరు వర్షం

బొమ్మనహాళ్, మే 17: మండలంలోని పలు గ్రామాలలో ఓ మోస్తరు వర్షం గురువారం రాత్రి కురిసింది. 28.0 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. మండల కేంద్రమైన బొమ్మనహాళ్‌తో పాటు ఉద్దేహాళ్, దేవగిరిక్రాస్, శ్రీధరఘట్ట ప్రాంతాలలో పెద్ద గాలి లేకపోయినా వర్షం పడింది. వర్షం ముందస్తుగా రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సేద్యం పనులు చేసుకునేందుకు అనుకూలంగా ఉంటుందని రైతులు అంటున్నారు.

రేపు టౌన్ బ్యాంక్ వార్షిక మహాసభ

గుత్తి, మే 17: పట్టణంలోని దిగుత్తి కోఆపరేటివ్ టౌన్ బ్యాంక్ లిమిటెడ్ 101వ వార్షిక మహాసభను ఈనెల 19న ఆదివారం ఉదయం 11 గంటలకు స్థానిక వసుధ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహిస్తున్నట్లు బ్యాంక్ అధ్యక్షుడు అబ్దుల్ జిలాన్, సీఈఓ మహేశ్వర ప్రసాద్ శుక్రవారం తెలిపారు. 2023-24 ఏడాదికి సంబంధించి అంచనా, బడ్జెట్‌కు మించిన ఆదాయవ్యయాలను ఆమోదించుట, సభ్యులకు డివిడెండ్‌లు పంపిణీ చేయుటకు తదితర అంశాలకు సంబంధించి చర్చ జరుగుతుందన్నారు. ఖాతాదారులు, సభ్యులు ఈ సమావేశానికి హాజరై విజయవంతం చేయాలన్నారు.

డ్రైడేను పాటించండి



వాటర్ ట్యాంకు వద్ద అబేట్ గుళికలు చల్లుతున్న ఆరోగ్య సిబ్బంది

బ్రహ్మసముద్రం, మే 17: మండలకేంద్రంలోని పీహెచ్‌సీ ఎదురుగా ఉన్న కొత్తిండ్లలో శుక్రవారం మండల వైద్యాధికారి డాక్టర్ రాజేష్‌కుమార్ ఆధ్వర్యంలో డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఆస్పత్రి ఎదురుగా ఉన్న వాటర్ ట్యాంక్ పరిసరాల్లో నీరు నిల్వ ఉండి, అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతంలో వైద్యసిబ్బంది అబేట్ గుళికలు చల్లారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ రాబోయేది వర్షాకాలం కాబట్టి జ్వరాలు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా శుభ్రంగా వుంచుకోవాలని, సాయంత్రం వేళల్లో వేపాకు పొగ వేసుకోవాలని, దోమతెరలు వాడాలని కోరారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రామ లక్ష్మమ్మ, ఫార్మసిస్ట్ మహేష్, హెల్త్ అసిస్టెంట్ నారాయణ, ఏఎన్‌ఎంలు రోజా, నాగమణి పాల్గొన్నారు.

ఆసుపత్రి ఆవరణలోనే వాహనాల పార్కింగ్

ఇబ్బంది పడుతున్న రోగులు, వారి బంధువులు

గుంతకల్లుటౌన్, మే 17: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో యథేచ్ఛగా వాహనాల పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ఆసుపత్రికి వచ్చే రోగులు, గర్భవతులు, బాలింతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి రోజూ వందలాది మంది ఇన్, అవుట్ పెషంట్లు వస్తుంటారు. ఆసుపత్రిలో అడ్మిట్ అయిన రోగులను చూడడానికి బంధువులు వస్తుంటారు. నిత్యం రద్దీగా ఉండే ఫార్మసీ స్టోర్ వద్ద మెయిన్ గేట్‌కు ఇరువైపులా స్కూటర్ల పార్కింగ్ పెద్ద సమస్యగా మారింది. ఆసుపత్రిలోని ఫార్మసీ స్టోర్ వద్ద ఒక పక్క నీటి ట్యాంక్, మరో పక్క ఇతర సామాన్లు పెట్టారు. స్కూటర్ల మధ్యలో నుంచి వార్డులలోకి వెళ్లాలంటే నానా అవస్థలు పడాల్సి వస్తోందని రోగులు, వారి బంధువులు వాపోతున్నారు. కొందరు స్కూటర్లకు తగిలి కింద పడుతున్నారు. రాత్రి వేళలో ఆసుపత్రిలోని మెయిన్ గేట్‌లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. వాహనాలను పార్కింగ్ చేయడంతో క్యాజువాలిటీలోకి రోగులను వీల్‌ఛైర్, స్ట్రెచర్‌లో తీసుకెళ్లడానికి ఇబ్బంది పడాల్సి వస్తోంది.



ఆసుపత్రిలో పార్కింగ్ చేసిన స్కూటర్లు

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవం



ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

పామిడి, మే 17: పట్టణంలోని 44వ జాతీయ రహదారి పక్కన గల వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆరాధనోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌లో వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవ విగ్రహాన్ని కొలువుదీర్చి పట్టణ వీధుల్లో ఊరేగించారు.

జాతీయ స్థాయి ట్రెక్కింగ్ పోటీల్లో ప్రతిభ



ట్రెక్కింగ్‌లో పాల్గొన్న విద్యార్థినులతో ఎన్‌సీసీ అధికారి

బ్రహ్మసముద్రం, మే 17: జాతీయ స్థాయి ట్రెక్కింగ్ పోటీల్లో బ్రహ్మసముద్రం మండలం బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ కనబరచినట్లు ప్రిన్సిపాల్ సత్యవతమ్మ తెలిపారు. ఈ నెల 6 నుంచి 14 వరకు ఈ పోటీలు ఊటీలో జరిగాయన్నారు. తొమ్మిదో తరగతి విద్యార్థినులు పి. అహల్య, ఎం. దీక్ష పాఠశాల పోటీల్లో పాల్గొన్నారు. ఊటీ, నంజనాడు, కెట్టి ప్రాంతాల్లో పది రోజులు ట్రెక్కింగ్ చేసినట్లు తెలిపారు. విద్యార్థులు దేశ స్థాయిలో పాల్గొనేలా తీర్చిదిద్దిన ఎన్‌సీసీ అధికారిణి సంగీత శశికళను అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఎంపీటీసీకి గాయాలు

కణేకల్లు, మే 17: మండలంలోని హనుమాపురం టీడీపీ ఎంపీటీసీ నరేంద్ర రోడ్డు ప్రమాదంలో శుక్రవారం తీవ్రంగా గాయపడ్డాడు. మండల కేంద్రంలోని సాయిబాబా గుడి వద్ద ద్విచక్ర వాహనంపై



ఎంపీటీసీని పరామర్శిస్తున్న కాలవ శ్రీనివాసులు

వెళుతున్న నరేంద్ర ప్రమాదవశాత్తు బైక్ నుండి కిందకు పడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని కణేకల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు ప్రభుత్వాసుపత్రికి చేరుకుని నరేంద్రను పరామర్శించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు లాలెప్ప, ఆనంద్‌రాజ్, షేక్‌ఫక్రుద్దీన్, వేలూరు మరియప్ప, ఎస్కే మల్లికార్జున, బీటీ రమేష్, మాబుసాబ్, గోపాల్‌రెడ్డి, అనిల్, వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

నింబగల్లు సమీపంలో ఇద్దరు ఏపీఎంలకు..

ఉరవకొండ,మే17: మండలంలోని నింబగల్లు సమీపంలోని ఓ పెట్రోల్ బంక్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వైకేపీ ఏపీఎంలు ఇద్దరికి గాయాలయ్యాయి. బెళుగుప్ప, విడపనకల్లు మండలాల్లో పనిచేస్తున్న ఏపీఎంలు రామ్మోహన్, ఆంజనేయులు ఉరవకొండలో పని ముగించుకుని బెళుగుప్పకు ద్విచక్రవాహనంలో బయలుదేరారు. మరమ్మతులకు గురైన ఓ వాహనాన్ని ఆటోకు కట్టుకుని వస్తుండగా నింబగల్లు సమీపంలో ద్విచక్రవాహనం, మరమ్మతులకు గురైన వాహనం ఢీకొన్నాయి. గాయపడిన వారిని ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రామ్మోహన్ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించాలని వైద్యులు సూచించారు. గాయపడిన వారిని ఉరవకొండ ఏపీఎం శివయ్య, సిబ్బంది పరామర్శించారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

పుట్లూరు, మే17: మండలంలోని నారాయణపల్లి గ్రామానికి చెందిన జెండా రామాంజనేయులు అదృశ్యమైనట్లు పోలీసులు శుక్రవారం తెలిపారు. ఈనెల 2న చెన్నైకి వెళ్లి వస్తానని భార్యతో చెప్పి వెళ్లాడన్నారు. ఇప్పటివరకు తిరిగి ఇంటికి రాకపోవడంతో భార్య నాగలక్ష్మి ఫిర్యాదు చేశారన్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నేడు డయల్ యువర్ డీఎం

తాడిపత్రిటౌన్, మే17: స్థానిక ఆర్టీసీడిపో కార్యాలయంలో శనివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ శంకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు తమ విలువైన సలహాలు, సూచనలను 9959225856 నెంబర్ ద్వారా అందించాలని ఆయన కోరారు.

తల్లిని చంపిన కేసులో కుమారుడి అరెస్టు

కళ్యాణదుర్గం, మే 17: కంబదూరు మండలంలోని వైసీపల్లిలో తల్లిని చంపిన కేసులో కుమారుడిని కళ్యాణదుర్గం రూరల్ సీఐ నాగరాజు, ఎస్‌ఐ ఆంజనేయులు శుక్రవారం అరెస్టు చేశారు. ఈ వివరాలను విలేకరుల సమావేశంలో వారు వివరాలు వెల్లడించారు. వైసీపల్లిలో వడ్డే సుంకమ్మ భర్త రామదాసుతో కలిసి నివసిస్తోంది. వారి కుమారుడు వెంకటేశులు అనంతపురంలో భార్యతో కలిసి ఉంటున్నాడు. ఈయన అప్పుడప్పుడు వైసీపల్లి గ్రామానికి వచ్చి వెళుతుండేవారు. అయితే సుంకమ్మ, రామదాసు తరచూ కుటుంబ సమస్యలతో గొడవపడుతుండేవారు. వారం రోజుల కిందట దంపతుల మధ్య జరిగిన గొడవలో రామదాసు కాలికి గాయమైంది. ఈ విషయం తెలుసుకున్న కుమారుడు వెంకటేశులు ఈ నెల 14న వైసీపల్లికి వచ్చాడు. తండ్రి రామదాసును కొట్టిందన్న కోపంతో తల్లి వడ్డే సుంకమ్మతో గొడవకు దిగాడు. ఈక్రమంలో ఆవేశంతో తల్లి తలను ఇంట్లో ఉన్న గ్యాస్ స్టవ్‌కు ఏర్పాటు చేసిన నల్లబండకు బలంగా కొట్టాడు. తీవ్రంగా గాయపడిన ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. శుక్రవారం వెంకటేశులును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వారు తెలిపారు.

విద్యుదాఘాతంతో గొర్రెలు మృతి

కళ్యాణదుర్గం, మే 17: కంబదూరు మండలంలోని రాళ్లపల్లికి చెందిన ఎరికుల మారెన్న మూడు గొర్రెలు విద్యుదాఘాతంతో మృతి చెందాయి. బాధితుడు తెలిపిన మేరకు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఏర్పాటు చేసిన అర్త్ వైర్లకు విద్యుత్ సరఫరా కావడంతో మేత కోసం వెళ్లిన గొర్రెలకు విద్యుత్ షాక్ కొట్టి మూడు గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. వర్షం కురుస్తున్న సమయంలో ఇలా జరిగిందన్నారు. దాదాపు రూ.30 వేల నష్టం జరిగిందన్నారు.



గొర్రెల కళేబరాలు